


నేటి పత్రిక

# ప్రజా వార్త

NETI PATRIKA PRAJA VARTHA

తెలుగు వార పత్రిక

Postal License No.VJ/220/2023-25



TELUGU ONLINE DIGITAL NEWS PORTAL & ONLINE CHANEL

Prajavatha-Online Telugu News

http://www.prajavartha.com

వీక్షించండి .. చదవండి... చెప్పండి...



విజయవాడ | తేదీ : 1-7 మే 2025 | సంపాదకులు : కొండూరి శ్రీనివాసరావు | సంపుటి: 04 | సంచిక : 47 | పేజీలు : 4 | రూ. 5.00


## అమరావతి పునర్ నిర్మాణానికి బటన్ నొక్కిన ప్రధాని మోదీ




అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : ఐదు కోట్ల మంది ఆంధ్రుల రాజధాని అమరావతి నిర్మాణానికి ప్రధాని నరేంద్ర మోదీ పునఃప్రారంభోత్సవం చేశారు. ఇవాళ అమరావతిలో ఏర్పాటు చేసిన భారీ సభలో, లక్షలాది మంది ప్రజల సమక్షంలో, సభా వేదిక పైనుంచే రాజధాని పునర్ నిర్మాణ పనులకు లాంఛనంగా శంకుస్థాపన చేశారు. బటన్ నొక్కి రాజధాని పనులు సహా మొత్తం రూ.58 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. అందులో రాజధాని పనుల విలువ రూ.49,040 కోట్లు. రూ.8 కోట్ల విలువైన వివిధ కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులకు కూడా ప్రధాని మోదీ నేడు శంకుస్థాపన చేశారు. ఇవాళ్టి కార్యక్రమంలో మొత్తంగా 18 ప్రాజెక్టులకు మోదీ శ్రీకారం చుట్టారు.

**మూడేళ్ల తర్వాత అమరావతి సిటీ ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీ మళ్లీ రావాలి: చంద్రబాబు**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పునర్ నిర్మాణ పనుల ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. ప్రధాని నరేంద్ర మోదీ సంపూర్ణ సహకారంతో అమరావతిని ప్రపంచం గర్వించేలా నిర్మిస్తామని, ఐదు కోట్ల ఆంధ్రుల ఆశలు, ఆకాంక్షలకు ప్రతిరూపంగా నిలుపుతామని ధీమా వ్యక్తం చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి 94 శాతం స్ట్రయిక్ రేట్‌తో చరిత్రాత్మక విజయం సాధించిందని చంద్రబాబు గుర్తుచేశారు. తాము అధికారంలోకి వచ్చేనాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ వెంటిలేటర్‌పై ఉందని, ప్రధాని మోదీ అండతో దానిని తిరిగి గాడిలో పెడుతున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని హామీ ఇచ్చారు. గత ఐదేళ్ల వైఎస్ఆర్‌సీపీ పాలనలో జరిగిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని ఇప్పుడిప్పుడే బయటకు తీసుకొస్తున్నామని అన్నారు. అమరావతి కేవలం ఒక నగరం కాదని, అది ఐదు కోట్ల ఆంధ్రుల సెంటిమెంట్ అని ముఖ్యమంత్రి ఉద్ఘాటించారు. రాజధాని నిర్మాణం కోసం నాడు 29 వేల మంది రైతులు తమ భవిష్యత్తును త్యాగం చేసి 34 వేల ఎకరాల భూమిని స్వచ్ఛందంగా ప్రభుత్వానికి అప్పగించారని గుర్తుచేశారు. చారిత్రకంగా అమరలింగేశ్వర స్వామి, కృష్ణానది, బౌద్ధారామాలకు నిలయమైన అమరావతి అని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో అమరావతి రైతులు చెప్పలేని కష్టనష్టాలు అనుభవించారని, వారి పోరాటం, త్యాగం మరువలేనిదని అన్నారు. అమరావతి ఉద్యమం లాంటి దాన్ని తన జీవితంలో చూడలేదని కొనియాడారు. 2024 ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన ఏకపక్ష తీర్పుతో అమరావతికి మళ్లీ ప్రాణం పోశారని వ్యాఖ్యానించారు. ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా రాజధాని పునర్ నిర్మాణ పనులను ప్రారంభించుకోవడం ఆంధ్రప్రదేశ్ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించదగిన రోజని చంద్రబాబు అభివర్ణించారు. ఐదు కోట్ల మంది ప్రజలు గర్వంగా 'ఇది మా రాజధాని' అని చెప్పుకునేలా అమరావతిని తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. విద్య, వైద్య రంగాలకు కేంద్రంగా, ప్రపంచంలోని అన్ని ప్రధాన నగరాలతో అనుసంధానమై ఉండేలా, గ్రీన్ ఎనర్జీతో కాలుష్య రహిత నగరంగా అమరావతిని అభివృద్ధి చేస్తామని వివరించారు. అమరావతిలో సుమారు 5 లక్షల మంది విద్యార్థులు చదువుకునేలా విద్యాసంస్థలను ఏర్పాటు చేస్తామన్నారు. గతంలో హైదరాబాద్‌లో హైటెక్ సిటీని స్థాపించి ఐటీ విప్లవానికి నాంది పలికామని, దానిని నాటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రారంభించారని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. అదే స్ఫూర్తితో అమరావతిలో క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించి ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి దిగ్గజ సంస్థలతో కీలక ఒప్పందాలు (ఎంవోయూలు) కుదుర్చుకున్నట్లు వెల్లడించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో ఏఐ (కృత్రిమ మేధ) రంగంలోనూ ఏపీ దూసుకుపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మూడేళ్ల తర్వాత అమరావతి నగరం పూర్తిస్థాయిలో రూపుదిద్దుకున్నాక, మళ్లీ ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీ రావాలని చంద్రబాబు ఆకాంక్షించారు. అమరావతి అభివృద్ధికి మోదీ అందిస్తున్న సహకారం చిరస్థాయిగా నిలిచిపోతుందని, ఆయన ఆశీస్సులు తమకు ఎల్లప్పుడూ ఉండాలని కోరారు. కేవలం అమరావతే కాకుండా, రాష్ట్రంలోని అన్ని 26 జిల్లాలను సమానంగా అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పునరుద్ఘాటించారు. ఇవాళ అమరావతికి వర్ష సూచన ఉందన్నారని, కానీ వర్షం రాకుండా దేవతలు మొత్తం ఆశీర్వదించారని చంద్రబాబు సంతోషంగా చెప్పారు. ప్రధాని మోదీ కూడా ఒక మాట అన్నారని, తన 25 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏ సభ కూడా ప్రతికూల వాతావరణం కారణంగా రద్దవలేదని, ఇవాళ అమరావతి సభ కూడా సక్సెస్ అయి తీరుతుందని చెప్పారని చంద్రబాబు వివరించారు.

## జయహో భారత్... సింధూర్ సివంగిలకు సెల్యూట్





అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : "అసలు వాళ్లిద్దరూ నడచి వస్తుంటే ఆడ పులులు గుర్తుకొచ్చాయట! బూజ్ బంప్స్ అట! వారు మాట్లాడుతున్నంత సేపు అలాగే చూస్తుండి పోయారట! నోట మాటల్లేవు అట! ఏమి ఆత్మ విశ్వాసం రా! ఆ జాబ్ అలాంటిది" అని చెబుతుంటే వింటున్న నాలోనూ ఉత్తేజం, ఉత్సాహం పెల్లుబుకింది! అసలు దేశ భద్రతా చరిత్రలోనే ఇలా ఒక ఆపరేషన్ కు ఇరువురు మహిళలు నాయకత్వం వహించడం మొదటిసారి! దానికన్నా ముఖ్యమైంది... ఆపరేషన్ సక్సెస్ అయ్యాక దేశ ప్రజలకు వివరించే క్రమం ఎప్పుడూ పురుష అధికారులే తీసుకుంటారు! కానీ, మొట్టమొదటిసారి మీడియా ముందుకు వచ్చి జరిగింది వివరించే అవకాశం ఆ సివంగులకే ఇచ్చారు! ఒకరు ఆర్మీ కల్నల్ సోఫియా ఖురేషి, మరొకరు ఎయిర్ ఫోర్స్ వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్! ఇద్దరూ ఇద్దరే మిస్సైల్స్ లా కనిపించారు! మనం ఇక్కడ ముస్లిం లు హిందువులు అంటూ తెగ రెచ్చిపోతాం! సోషల్ మీడియాలో యుద్ధం చేసేస్తాం! కానీ, రక్షణ శాఖ ఆధ్వర్యంలో భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ కు ఆర్మీ దళానికి నాయకత్వం వహించింది గుజరాత్ కు చెందిన ముస్లిం మహిళ సోఫియా ఖురేషి! ఆమె భర్త, తండ్రి, తాత అందరూ భారత ఆర్మీ అధికారులే! 2016లోనే పూణే లో జరిగిన బహుళ జాతీయ సైనిక విన్యాసం ఎఫ్ 18కు నాయకత్వం వహించి తొలి మహిళా లెఫ్టినెంట్ కల్నల్ గా సోఫియా చరిత్ర సృష్టించారు! యుయన్ శాంతి పరిరక్షణ మిషన్ లోనూ తన సత్తా చాటుకున్నారు! ఆమె ఇవాళ ఆపరేషన్ సింధూర్ గురించి వివరించి "సైన్యంలో చేరండి" అంటూ ముగించి యువతకు ముఖ్యంగా అమ్మాయిలకు గొప్ప పిలుపునిచ్చారు. ఆమెకు చిన్నప్పుడు వ్యోమిక అని ఎందుకు పేరు పెట్టారో కానీ ఆ పేరును సార్థకం చేసుకుంది ఎయిర్ ఫోర్స్ దళ వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్! ఆపరేషన్ సింధూర్ లో వైమానిక దాడులకు ఆమె నాయకత్వం వహించారు! ఇంజనీరింగ్ పూర్తి చేసి ఇంట్లో వాళ్ళు వారించినా ఆమె పట్టుబట్టి వైమానిక దళంలో హెలికాప్టర్ పైలట్ గా చేరారు! చేతక్, చీతా యుద్ధ హెలికాప్టర్లను నడపడంలో ఆమె సివంగి! కొండల్లో లోయల్లో హెలికాప్టర్ నడపడంలో దిట్ట! అందుకే జమ్ము కాశ్మీర్, అరుణాచలప్రదేశ్ లలో జరిగిన పలు రెస్క్యూ ఆపరేషన్స్ లో వ్యోమికాను మాత్రమే రంగంలోకి దించుతుంది భారత వైమానిక దళం! మొత్తానికి మన ఇండియా ఇటు మాక్ డ్రిల్ అని ప్రకటించి కాస్త ఎడమార్చి అటు పాక్ ఉగ్రవాదుల పై ముందస్తు యుద్ధం చేసి దిగ్విజయంగా ముగించింది! జయహో భారత్! కేవలం 27 నిముషాల్లో తొమ్మిది ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసేసింది మన సైన్యం! పాక్ తొండి చేస్తూ అంగీకరించక పోయినా దాదాపు వంద మంది వరకు ఉగ్రవాదులు ఈ సింధూర్ ఆపరేషన్ లో హతమయ్యారని తెలుస్తోంది! 26 మంది భారత మహిళల సింధూరాన్ని చెరిపేసిన పాక్ ఉగ్రవాదులను 27 నిముషాల్లో మట్టి కరిపించి ప్రతీకారం తీర్చుకుంది! ఈ ఆపరేషన్ కు సింధూర్ అని నామకరణం చేయడం, ఆర్మీ, వైమానిక దళాలకు మహిళలు నాయకత్వం వహించడం భారత రక్షణ శాఖ తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయం దిగ్విజయం అయ్యింది! పాక్ ఉగ్రవాదులు భారత అమాయక పర్యాటకుల ప్రాణాలు నిర్దాక్షిణ్యంగా తీసినా, మన సైన్యం మాత్రం మామూలు జనం జోలికి వెళ్ళకుండా గొప్ప మానవతను చాటుకుంది! పాకిస్థాన్ తోక ముడిచింది! యుద్ధం చేసే ఆలోచన లేదంటూ ఐక్యరాజ్య సమితిని ఆశ్రయించింది! జయహో భారత్!

## పహల్గామ్ దాడి.. ఆహారాన్ని నిల్వ చేసుకోవాలని పీవోకేలో ప్రజలకు అలర్ట్

డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త :పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లో, ముఖ్యంగా వాస్తవాధీన రేఖ (ఎల్వోసీ) వెంబడి నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఆహార నిల్వలను సిద్ధం చేసుకోవాలని స్థానిక యంత్రాంగం సూచించింది. భారత్–పాకిస్థాన్‌ల మధ్య ఇటీవల పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. శుక్రవారం స్థానిక అసెంబ్లీలో చౌధ్రీ అన్వర్ ఉల్ హక్ మాట్లాడుతూ, నియంత్రణ రేఖకు సమీపంలో ఉన్న 13 నియోజకవర్గాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. "రాబోయే రెండు నెలలకు సరిపడా ఆహార ధాన్యాలు, నిత్యావసరాలను నిల్వ చేసుకోవాలని ప్రజలకు సూచించాం" అని వెల్లడించారు. అంతేకాకుండా, ఎలాంటి ప్రతికూల పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు స్థానిక ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఇందుకోసం రూ.100 కోట్లతో ఒక అత్యవసర నిధిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆహారం, ఔషధాలు, ఇతర కనీస అవసరాల సరఫరాలో ఎటువంటి అంతరాయం ఏర్పడకుండా చూడటమే ఈ నిధి యొక్క ముఖ్య ఉద్దేశ్యమని ఆయన వివరించారు.

## పహల్గామ్ దాడి.. ఉగ్రవాదంపై మోదీ మరోసారి కీలక వ్యాఖ్యలు



ఢిల్లీ, నేటి పత్రిక ప్రజావార్త : ఉగ్రవాదం, దానికి మద్దతునిస్తున్న శక్తులపై అత్యంత కఠినమైన, నిర్ణయాత్మక చర్యలు తీసుకోవడానికి భారత్ సంపూర్ణంగా కట్టుబడి ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. ఉగ్రవాదం మానవాళికి పెను ముప్పు అని అభివర్ణించారు. భారత పర్యటనలో ఉన్న అంగోలా అధ్యక్షుడు జువా లోరెన్సోతో ఢిల్లీలో జరిగిన ద్వైపాక్షిక చర్చల అనంతరం ఏర్పాటు చేసిన సంయుక్త మీడియా సమావేశంలో ప్రధాని మోదీ ఈ ప్రకటన చేశారు. ఇటీవల జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి ఘటనను ప్రధాని ఈ సందర్భంగా ప్రస్తావించారు. సరిహద్దు ఉగ్రవాదంపై భారత్ చేస్తున్న పోరాటానికి అంగోలా ప్రభుత్వం మద్దతు ఇవ్వడం పట్ల మోదీ కృతజ్ఞతలు తెలిపారు. "ఉగ్రవాదం మానవాళికి అతిపెద్ద శత్రువు. దీనిని ఎదుర్కోవడానికి మేం సిద్ధంగా ఉన్నాం. ఉగ్రవాదులు, వారికి అండగా నిలిచే వారిపై కఠినమైన, నిర్ణయాత్మక చర్యలు తీసుకునేందుకు మేం పూర్తిగా కట్టుబడి ఉన్నాం" అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. భారత్, అంగోలా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, అంతర్జాతీయ అంశాలపై ఇరువురు నేతలు చర్చలు జరిపారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ఇరు దేశాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.

## పాక్ కు మరో షాకిచ్చిన కేంద్రం..

పహల్గామ్ ఉగ్రదాడిని తీవ్రంగా పరిగణించిన భారత ప్రభుత్వం.. దీని వెనక పాక్ ఉందని ఆరోపిస్తూ ఆ దేశంపై కఠిన చర్యలు చేపట్టింది. జాతీయ భద్రత, ప్రజా విధాన ప్రయోజనాల దృష్ట్యా పాకిస్థాన్ నుంచి జరిగే అన్ని రకాల దిగుమతులను తక్షణమే నిషేధిస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ శుక్రవారం ఒక నోటిఫికేషన్ జారీ చేసింది. పాకిస్థాన్ నుంచి నేరుగా గానీ లేదా పరోక్షంగా గానీ వచ్చే అన్ని రకాల వస్తువుల దిగుమతులపై ఈ నిషేధం వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. మేడిన్ పాకిస్థాన్ వస్తువులకు భారత్ లో చోటులేదని, అక్కడి నుంచి ఎగుమతి అయిన ఏ వస్తువునైనా భారత్‌లోకి అనుమతించబోమని స్పష్టం చేసింది. ప్రస్తుతం రవాణా మార్గంలో ఉన్న సరుకులకు కూడా ఈ నిషేధం వర్తిస్తుందని తెలిపింది. "పాకిస్థాన్ మూలం ఉన్న లేదా అక్కడి నుంచి ఎగుమతి అయిన ఏ వస్తువైనా సరే భారతదేశంలోకి అనుమతించబోం.. అన్ని వస్తువుల దిగుమతి లేదా రవాణాపై నిషేధం అమలు చేస్తున్నాం. జాతీయ భద్రత, ప్రజా విధానం దృష్ట్యా ఈ ఆంక్షలు విధించబడ్డాయి" అని వాణిజ్య మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్‌లో వివరించింది. అత్యవసర పరిస్థితుల్లో ఏవైనా మినహాయింపులు కావాలంటే భారత ప్రభుత్వ ముందస్తు అనుమతి తప్పనిసరి అని స్పష్టం చేసింది.

## ముఖ్యమంత్రి చంద్రబాబుతో డిఫెన్స్, స్పేస్ సలహాదారుల సమావేశం

*-ఆంధ్రప్రదేశ్‌ను దేశీయ రక్షణ, అంతరిక్ష రంగాల్లో ముందడుగు వేయించేందుకు తొలి అడుగు*



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : డిఫెన్స్ మరియు స్పేస్ రంగాల్లో అగ్రగామి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కీలక సమావేశం జరిగింది. ఈ రోజు రాష్ట్ర సచివాలయంలో, మాజీ డిఆర్డిఓ చైర్మన్, ప్రస్తుత రాష్ట్ర డిఫెన్స్, ఏరోస్పేస్ హబ్ సలహాదారు డా. జి. సతీష్ రెడ్డి ముఖ్యమంత్రిని కలవడం, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలపై ప్రజెంటేషన్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా, రాబోయే డిఫెన్స్–ఏరోస్పేస్ పాలసీ రూపకల్పనలో తమ అనుభవాన్ని పంచుతూ, దేశానికే ఆదర్శంగా నిలిచే విధంగా అత్యుత్తమ విధానాన్ని రూపొందించాలని డా. సతీష్ రెడ్డి అనేక విలువైన సూచనలు చేశారు. రాష్ట్రంలోని కీలక ప్రాంతాల్లో డిఫెన్స్, ఏరోస్పేస్ హబ్‌లు ఏర్పాటయ్యే దిశగా చర్చలు సాగాయి. ప్రజెంటేషన్ అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డా.సతీష్ రెడ్డిని శాలువా కప్పి, సత్కరించి, రక్షణ రంగంలో ఆయన చేసిన విశేష సేవలకు గౌరవం తెలిపారు. విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేసినేని శివనాథ్ మాట్లాడుతూ, "ఇది ఉద్యోగ అవకాశాల కల్పనకు, దేశ రక్షణ రంగ అభివృద్ధికి కీలక మలుపు. ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తులో శక్తివంతమైన రక్షణ రంగ పునాదులు వేసుకుంటోంది," అని అన్నారు.

## నాకూ బెదిరింపు కాల్స్ వస్తున్నాయి..



డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సైతం తనకు బెదిరింపు ఫోన్ కాల్స్ వస్తున్నాయని తెలిపారు. రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ యూటీ ఖాదర్‌కు గుర్తుతెలియని వ్యక్తుల నుంచి బెదిరింపు కాల్స్ వచ్చిన విషయంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ ఈ విషయాన్ని వెల్లడించారు. "అవును.. నాకు కూడా బెదిరింపు ఫోన్ కాల్స్ వస్తున్నాయి. ఈ విషయంపై పోలీసులకు సమాచారం ఇచ్చాం. బెదిరింపులకు పాల్పడుతున్న వారిని గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించాం" అని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య విలేకరులతో అన్నారు. తనకు వస్తున్న బెదిరింపులపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఇటీవల మంగళూరులో జరిగిన బజరంగ్ దళ్ కార్యకర్త సుహాస్ శెట్టి హత్య ఘటనపై కూడా ముఖ్యమంత్రి స్పందించారు. ఈ హత్య కేసులో ప్రమేయమున్న నిందితులను వీలైనంత త్వరగా గుర్తించి, అరెస్టు చేయాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించినట్లు తెలిపారు. మంగళూరులో సుహాస్ శెట్టిని నడిరోడ్డుపై కొందరు దుండగులు కత్తులతో దాడి చేసి దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన నేపథ్యంలో మంగళూరులో పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. నగర పోలీస్ స్టేషన్ పరిధిలో నిషేధాజ్ఞలు విధించి, ప్రజలు గుంపులుగా గుమిగూడటాన్ని, ఊరేగింపులు, నినాదాలు చేయడాన్ని నిషేధించారు.


## రష్యాతో యుద్ధంలో ఉక్రెయిన్ సంచలనం..

డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : రష్యాతో జరుగుతున్న యుద్ధంలో ఉక్రెయిన్ సంచలనం సృష్టించింది. రష్యాకు చెందిన సుఖోయ్–30 (ఎస్‌యూ–30) యుద్ధ విమానాన్ని తమ సముద్ర ఆధారిత మానవ రహిత నౌక (డ్రోన్) నుంచి ప్రయోగించిన క్షిపణితో కూల్చివేసినట్టు ఉక్రెయిన్ సైనిక గూఢచార సంస్థ (జీయూఆర్) సంచలన ప్రకటన చేసింది. ప్రపంచ యుద్ధ చరిత్రలో సముద్ర డ్రోన్ సహాయంతో మానవ సహిత యుద్ధ విమానాన్ని కూల్చివేయడం ఇదే తొలిసారని కీవ్ వర్గాలు పేర్కొన్నాయి. జీయూఆర్ కథనం ప్రకారం.. ఈ ఆపరేషన్‌ను వారి ప్రత్యేక విభాగం 'గ్రూప్ 13' శుక్రవారం నల్ల సముద్రంలో విజయవంతంగా నిర్వహించింది. రష్యాకు చెందిన ప్రధాన ఓడరేవు నగరం నోవోరోసిస్క్‌కు పశ్చిమాన సుమారు 50 కిలోమీటర్ల దూరంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇటీవల ఉక్రెయిన్ ఎక్కువగా ఉపయోగిస్తున్న 'మగురా వీ5' రకం సముద్ర డ్రోన్‌పై అమర్చిన క్షిపణి ద్వారా ఈ దాడి చేసినట్టు జీయూఆర్ వివరించింది. ఈ ప్రకటనతో పాటు ఉక్రెయిన్ అధికారులు ఒక వీడియోను కూడా విడుదల చేశారు, అయితే ఆ ఫుటేజ్ ప్రామాణికత ఇంకా స్వతంత్రంగా ధ్రువీకరించలేదు. కూలిన విమానం విలువ 50 మిలియన్ డాలర్లు.. ఉక్రెయిన్ భద్రతా సేవ (ఎస్బీయూ), ఇతర సాయుధ దళాల విభాగాలతో సమన్వయం చేసుకుని ఈ ఆపరేషన్ చేపట్టినట్టు జీయూఆర్ తెలిపింది. కూల్చివేసిన విమానం రష్యాకు చెందిన ఎస్‌యూ–30 రకం అని, దీని విలువ సుమారు 50 మిలియన్ డాలర్లు (దాదాపు రూ. 415 కోట్లు) ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ విమానం 'గాలిలోనే మంటల్లో చిక్కుకుని సముద్రంలో కూలిపోయింది' అని ఉక్రెయిన్ వర్గాలు పేర్కొన్నాయి.

నోవోరోసిస్క్ నగరంలో అత్యవసర స్థితి... ఈ సంఘటనపై రష్యా రక్షణ మంత్రిత్వశాఖ నుంచి ఇప్పటివరకు ఎటువంటి అధికారిక స్పందన వెలువడలేదు. అయితే, ఈ ప్రకటన వెలువడటానికి ముందు నోవోరోసిస్క్ నగరంపై ఉక్రెయిన్ డ్రోన్ దాడి జరిగిందని, ఒక ధాన్యం టెర్మినల్, కొన్ని నివాస భవనాలు దెబ్బతిన్నాయని నగర మేయర్ ప్రకటించారు. ఈ దాడిలో ఐదుగురు గాయపడినట్టు స్థానిక అధికారులు తెలిపారు. నగరంలో అత్యవసర పరిస్థితి విధించారు.


రష్యా ప్రతీకార దాడులు... మరోవైపు, ఉక్రెయిన్ ఈ ప్రకటన చేసిన కొన్ని గంటల వ్యవధిలోనే రష్యా బలగాలు ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై డ్రోన్లతో ప్రతీకార దాడికి దిగాయి. రష్యా డ్రోన్లను ఉక్రెయిన్ గగనతల రక్షణ వ్యవస్థలు అడ్డగించినప్పటికీ, వాటి శకలాలు నగరంపై పడటంతో కనీసం రెండు జిల్లాల్లో నష్టం వాటిల్లింది. కొన్ని నివాస భవనాలు, పార్క్ చేసిన వాహనాల్లో మంటలు చెలరేగినట్లు అధికారులు వెల్లడించారు.

## పహలామ్ ఉగ్రదాడి తర్వాత.. ప్రధాని మోదీతో మొదటిసారి ఒమర్ అబ్దుల్లా భేటీ



ఢిల్లీ, నేటి పత్రిక ప్రజావార్త : జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా దేశ రాజధాని ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. ప్రధానమంత్రి అధికారిక నివాసంలో వీరిద్దరి మధ్య భేటీ జరిగిందని అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ సమావేశం సుమారు 30 నిమిషాల పాటు కొనసాగింది. ఇటీవల జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడితో సహా పలు కీలక అంశాలపై ప్రధానమంత్రి మోదీ, ఒమర్ అబ్దుల్లా చర్చించినట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా పర్యాటకులే లక్ష్యంగా జరిగిన ఈ దాడి ఘటన అనంతరం నెలకొన్న పరిస్థితులు, భద్రతాపరమైన అంశాలు వీరి మధ్య చర్చకు వచ్చినట్లు సమాచారం. గత నెల 22వ తేదీన పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు మరణించిన విషయం తెలిసిందే. ఈ విషాద సంఘటన తర్వాత ప్రధానమంత్రి మోదీ, ఒమర్ అబ్దుల్లా నేరుగా సమావేశం కావడం ఇదే మొదటిసారి.

## అమరావతి ప్రపంచ స్థాయి నగరంగా తయారవుతుంది...



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : ఏపీ రాజధాని అమరావతి పనుల పునఃప్రారంభోత్సవ సభలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రసంగిస్తూ రాజధాని రైతులపై ప్రశంసలు కురిపించారు. ఒక్క పిలుపుతో రాజధాని కోసం వేలాది ఎకరాల భూమిని ఇచ్చిన రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. రాజధాని కోసం అమరావతి రైతులు చేసిన పోరాటానికి శిరస్సు వంచి నమస్కారం చేస్తున్నానని చెప్పారు. అమరావతి రైతులు కేవలం భూములు మాత్రమే ఇవ్వలేదని... రాష్ట్రానికి భవిష్యత్తును ఇచ్చారని అన్నారు. ధర్మ యుద్ధంలో అమరావతి రైతులు గెలుపొందారని చెప్పారు. రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు తాము బాధ్యులుగా ఉంటామని డిప్యూటీ సీఎం హామీ ఇచ్చారు. రాజధానిని అద్భుతంగా నిర్మించి అమరావతి రైతుల రుణం తీర్చుకుంటామని చెప్పారు. ఎన్డీయే కేంద్రం, రాష్ట్రం సమన్వయంతో ఏపీ అద్భుతంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. దివిసీమ తుపానులా అమరావతిని గత ప్రభుత్వం తుడిచిపెట్టిందని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో అమరావతి రైతులు నలిగిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతి రైతుల త్యాగాలను మర్చిపోలేమని చెప్పారు. పహల్గామ్ దుర్ఘటనలో 27 మంది మరణించారని... ఈ సమయంలో ఎంతో బిజీగా ఉన్నప్పటికీ ప్రధాని మోదీ అమరావతి కోసం ఇక్కడకు రావడం... అమరావతిపై ఆయనకున్న ఇష్టానికి నిదర్శనమని పవన్ అన్నారు. ఎంతో విజన్ ఉన్న నాయకుడు సీఎం చంద్రబాబు అని కితాబిచ్చారు. ఎంతో దూరదృష్టితో హైదరాబాద్ లో హైటెక్ సిటీని నిర్మించిన చంద్రబాబు... ఇప్పుడు అమరావతికి శ్రీకారం చుట్టారని చెప్పారు. మోదీ, చంద్రబాబు నాయకత్వంలో ఏపీ దూసుకుపోతుందని ధీమా వ్యక్తం చేశారు.

## వరల్డ్ రెడ్ క్రాస్ డే సందర్భంగా కలెక్టర్లకు అవార్డులు ప్రదానం చేసిన గవర్నర్ అబ్దుల్ నజీర్



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : రెడ్ క్రాస్ ప్రభుత్వ ఆసుపత్రుల్లోని పేద రోగులకు ఉచితంగా రక్తం అందజేస్తున్నట్టు గవర్నర్ అబ్దుల్ నజీర్ తెలిపారు. గవర్నర్ , ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఏపీ రాష్ట్ర శాఖాధ్యక్షులు అబ్దుల్ నజీర్ గురువారం రాజ్‌భవన్ దర్బార్ హాల్‌లో జరిగిన వరల్డ్ రెడ్ క్రాస్, ఇంటర్నేషనల్ థలసీమియా డే కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, రెడ్ క్రాస్ రాష్ట్ర శాఖ 20 బ్లడ్ సెంటర్లను నిర్వహిస్తూ, ప్రతి సంవత్సరం 65,000 పైబడి రక్త యూనిట్లను సేకరిస్తోందని, లక్షకు పైగా యూనిట్లను అవసరమైన నిరుపేదలకు జారీ చేస్తోందని తెలిపారు. వీటిలో మూడొంతులు ప్రభుత్వ ఆసుపత్రులకు చేరుతుందన్నారు. కార్యక్రమంలో భాగంగా రెడ్ క్రాస్ ఉద్యమం కోసం విశేష సేవలు అందించి గరిష్టంగా విరాళాలు సమీకరించిన జిల్లా కలెక్టర్లకు గవర్నర్ అవార్డులు, పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా పశ్చిమ గోదావరి కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ఈ అవార్డు తన ఒక్కరి సొంతం కాదని, వరద బాధితుల సహాయార్థం, సహాయం చేసిన ప్రతి ఒక్కరి కృషికి ఇది గుర్తింపు అన్నారు. అవార్డుతో తన బాధ్యత పెరిగిందని భవిష్యత్తులో కూడా జిల్లా ప్రజల కోసం పూర్తిస్థాయిలో, అంకితభావంతో పనిచేస్తానన్నారు. దూరదృష్టి, అపారమైన అనుభవంతో జిల్లా యంత్రాంగానికి మార్గదర్శకత్వం వహించిన ముఖ్యమంత్రికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియ చేసారు. తూర్పు గోదావరి కలెక్టర్ పి. ప్రశాంతి, కృష్ణా కలెక్టర్ డి.కే. బాలాజీ, ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు కలెక్టర్ ఓ. ఆనంద్, నంద్యాల కలెక్టర్ జి. రాజకుమారి, కాకినాడ కలెక్టర్ సాగిలి షాన్ మోహన్, కర్నూలు కలెక్టర్ పి. రంజిత్ బాషా, బాపట్ల కలెక్టర్ జె. వెంకట మురళి లకు పతకాలు అందుకున్న వారిలో ఉన్నారు. తొలుత గవర్నర్ రాజ్‌భవన్ నుండి వర్చువల్ విధానంలో శ్రీకాకుళం జిల్లా రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్‌లో స్థాపించిన రెడ్ క్రాస్ థలసీమియా బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూషన్ సెంటర్‌ను ప్రారంభించారు. కీలక రక్త మార్పిడి చికిత్స అవసరమున్న పిల్లలు, వ్యక్తులకు మద్దతుగా ఈ పథకం చేపట్టారు. గవర్నర్ మాట్లాడుతూ ఇక రక్త కణ విభజన ఉన్న అన్ని బ్లడ్ సెంటర్లలో ట్రాన్స్‌ఫ్యూషన్ సేవలను విస్తరించాలన్నారు. కాకినాడలో ఏర్పాటు చేసిన రెడ్ క్రాస్ చైల్డ్ కేర్, మహిళా సంక్షేమం, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ శిలాఫలకాన్ని కూడా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తొలిమహిళ సమీరా నజీర్, గవర్నర్ కార్యదర్శి డాక్టర్ ఎం. హరి జవహర్‌లాల్, రెడ్ క్రాస్ ఏపీ రాష్ట్ర శాఖ చైర్మన్ వై.డి. రామారావు, సీఈఓ ఏ.కె. పరీడా, వివిధ జిల్లా శాఖల చైర్మన్లు, రాజ్‌భవన్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలకు, ప్రభుత్వ అధికారులకు, భాగస్వామ్య పక్షాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ధన్యవాదాలు

*-రాజధాని అమరావతి పనుల పునప్రారంభ కార్యక్రమం విజయవంతం పై ప్రజలకు, ప్రభుత్వ అధికారులకు, భాగస్వామ్య పక్షాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ధన్యవాదాలు, అభినందనలు*




అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా జరిగిన రాజధాని అమరావతి పనుల పున: ప్రారంభ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నాను. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలకు, రాజధాని రైతులకు, కార్యక్రమాన్ని అద్భుతంగా నిర్వహించిన ప్రభుత్వ యంత్రాంగానికి, అధికారులకు, మంత్రులకు, ప్రజాప్రతినిధులకు, కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లిన మీడియా, సోషల్ మీడియా వారికి కృతజ్ఞతాపూర్వక నమస్కారాలు తెలియజేస్తున్నాను. ప్రజల సహకారంతో, కేంద్ర మద్దతుతో, పక్కా ప్రణాళికతో అందరికీ అవకాశాలు సృష్టించేలా, రాష్ట్రానికి చోదక శక్తిగా నిలిచేలా ఫ్యూచర్ సిటీగా రాజధాని అమరావతిని నిర్మిస్తాం. అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి సాధించి... మాకు అండగా ఉన్న ప్రజల నమ్మకాన్ని నిలబెడతాం అని తెలుపుతూ.. ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.

# రెడ్ క్రాస్ అవార్డుకు ఎంపికైన పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి

*మానవీయ సేవలలో అగ్రగామిగా అత్యున్నత పనితీరును చూపిన చదలవాడ*




అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : మానవీయ సేవల్లో మెరుగైన పనితీరుకు గుర్తింపుగా పశ్చిమ గోదావరి కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ చదలవాడ నాగరాణి ఇండియన్ రెడ్ క్రాస్ రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపిక అయ్యారు. ఇటీవల ముంచెత్తిన వరదలలో స్థానిక ప్రజానీకాన్ని ఆదుకునే ప్రయత్నంలో నాగరాణి చేసిన కృషి గుర్తింపుగా 2023-24, 2024-25 సంవత్సరాలకుగాను రెడ్‌క్రాస్ ఈ అవార్డును ప్రకటించింది. కనీస రవాణా సదుపాయాలు సైతం అందుబాటులోకి రాని విపత్కర తుఫాను పరిస్థితుల్లో ప్రోటోకాల్ ను పక్కన పెట్టి ద్విచక్ర వాహనంపై లోతట్టు ప్రాంతాలను సందర్శించి బాధితులకు బాసటగా నిలిచారు. బుడమేరు వరద ముంపు బాధితులకు అండగా దాదాపు వారం రోజుల పాటు విజయవాడకు పెద్దయెత్తున ఆహార పదార్థాలను సరఫరా చేయించారు. పశ్చిమ గోదావరి జిల్లా నుండి వరద భాదితుల సహాయార్థం పెద్దయెత్తున నిధులు సమకూర్చి స్వయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకుకి అందించి మరికొందరికి ప్రేరణగా నిలిచారు. నాగరాణి అందించిన సేవలకు గాను ముఖ్యమంత్రి అభినందనలు అందుకున్నారు. రాష్ట్ర గవర్నర్, రెడ్ క్రాస్ అధ్యక్షుడు మానసీయ ఎస్. అబ్దుల్ నజీర్ మార్గదర్శకత్వంలో రాష్ట్ర రెడ్ క్రాస్ సహజ విపత్తుల సమయంలో సహాయక చర్యలు, రక్తదాన శిబిరాలు, ఫస్ట్‌ఎయిడ్ శిక్షణా కార్యక్రమాలు, వృక్షారోపణ కార్యక్రమాలు వంటి అనేక మానవతా కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందంజలో ఉంది. ప్రపంచ రెడ్ క్రాస్, తలసీమియా దినోత్సవాల సందర్భంగా మే 8న విజయవాడ రాజ్ భవన్ దర్బార్ హాల్‌లో నిర్వహించనున్న కార్యక్రమంలో గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా కలెక్టర్ నాగరాణికి ఈ పురస్కారం ప్రదానం చేయనున్నారు. 1920లో పార్లమెంట్‌లో ఆమోదించబడిన చట్టం ద్వారా స్థాపించబడిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, 1954లో సవరణ అనంతరం జాతీయ స్థాయిలో భారత రాష్ట్రపతి, రాష్ట్ర స్థాయిలో గవర్నర్ ఈ సంస్థకు అధ్యక్షత వహిస్తున్నారు. చదలవాడ నాగరాణి అందుకోనున్న ఈ అవార్డు, రాష్ట్రవ్యాప్తంగా మానవతా కార్యక్రమాల బలోపేతానికి కృషిచేస్తున్న సేవాభిమానుల త్యాగానికి ప్రతీకగా నిలుస్తుంది.

# తొమ్మిదిమంది డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : రాష్ట్రంలో తొమ్మిదిమంది డిప్యూటీ కలెక్టర్లను ప్రభుత్వం బదిలీ చేసింది. మంగళవారం ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు మెంబర్ సెక్రటరీగా ఉన్న శీనా నాయక్‌ను విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ ఈవోగా బదిలీ చేశారు. పులివెందుల ఆర్డీవోగా జి.చిన్నయ్యను, వెయిటింగ్‌లో ఉన్న కేవీఎల్ శివజ్యోతిని మహిళా, శిశు సంక్షేమశాఖ డైరెక్టరేట్‌లో జాయింట్ డైరెక్టర్‌గా నియమించారు. వెయిటింగ్‌లో ఉన్న హనుమంతరావు ఆనంద్‌ను అనంతపురం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(పీఏబీఆర్‌గా) నియమించారు. కాకినాడ సెజ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కేవీ రామలక్ష్మిని విశాఖపట్నం మహిళా, శిశు సంక్షేమశాఖ పీడీగా, తూర్పుగోదావరి జిల్లాలో డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌లో పనిచేస్తున్న జి.మమ్మిని కోనసీమ జిల్లా సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్‌గా, అనంతపురం జిల్లా (అహుడా) అహుడా సెక్రటరీ గౌరీశంకర్రావును తిరుపతి జిల్లా సమగ్ర శిక్షణ అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్‌గా, పల్నాడు జిల్లా ఎస్‌డీసీ కేఆర్‌ఆర్‌సీ కుమిదిని సింగ్‌ను కృష్ణా జిల్లా సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్‌గా, మచిలీపట్నం అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ ఎస్‌డీసీ పద్మావతిని గుంటూరు జిల్లా సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్‌గా బదిలీ చేశారు.

# త్వరలోనే ఏపీకి ట్రాన్స్ మీడియా ఎంటర్టైన్‌మెంట్ సిటీ: మంత్రి కందుల దుర్గేశ్



ముంబయి, నేటి పత్రిక ప్రజావార్త : భారతదేశపు మొట్టమొదటి ట్రాన్స్ మీడియా ఎంటర్‌టైన్‌మెంట్ సిటీని ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, క్రియేటివ్‌ల్యాండ్ ఆసియా సంస్థలు ముంబయిలో జరుగుతున్న వేవ్స్ సమ్మిట్-2025లో సహకారం అందించుకోనున్నాయని మంత్రి కందుల దుర్గేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. మే 1నుంచి4 వరకు తొలిసారిగా ఇండియాలో, ప్రత్యేకించి ముంబయిలో జరుగుతున్న ప్రతిష్ఠాత్మక వేవ్స్ (ది వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్)-2025లో ఈ మేరకు ఏపీ ప్రభుత్వం, క్రియేటివ్ ల్యాండ్ ఆసియా మధ్య అవగాహన ఒప్పందం (MOU) జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ ఎంవోయూ ద్వారా ఏపీకి వచ్చే పర్యాటకులు లీనమయ్యేలా థీమ్ పార్కులు, గేమింగ్ జోన్‌లు, గ్లోబల్ సినిమా కో-ప్రొడక్షన్ జోన్‌లు ఏర్పాటు కానున్నాయని మంత్రి దుర్గేశ్ వెల్లడించారు. అంతేకాకుండా, ఉద్యోగ సృష్టి, నైపుణ్య అభివృద్ధి, పర్యాటకం, డిజిటల్ ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఈ ఎంవోయూ దోహదం చేస్తుందని మంత్రి దుర్గేశ్ వివరించారు. ప్రస్తుతం మంత్రి కందుల దుర్గేశ్ వియత్నాంలో ఉండగా, పర్యాటక శాఖ ఎండీ ఆమ్రపాలి కాట, క్రియేటివ్‌ల్యాండ్ స్టూడియోస్ వ్యవస్థాపకురాలు, క్రియేటర్స్ ఇంక్ లండన్ ఛైర్మన్ సాజన్ రాజ్ కురుప్, హాలీవుడ్ నుండి గ్లోబల్ అడ్వైజరీ బోర్డు ప్రతినిధులు డేవిడ్ ఉంగర్ (సీఈవో ఆర్టిస్ట్ ఇంటర్నేషనల్), గ్లోబల్‌గేట్ మేనేజింగ్ డైరెక్టర్ విలియం ఫైఫర్, నికోలస్ గ్రానటినో (ఛైర్మన్ నోవాక్వార్క్) ఈ ఎంవోయూపై సంతకాలు చేశారు. ఇటీవలే క్రియేటివ్ ల్యాండ్ ఆసియా ప్రతినిధులు కొందరు వెలగపూడి సచివాలయంలోని మంత్రి కార్యాలయంలో ఈ విషయంపై చర్చించారు.

# విజయవాడ - విశాఖపట్నం మధ్య ఉదయం విమాన సేవలు జూన్ 1 నుండి పునఃప్రారంభం

*-కేంద్రమంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు*




శ్రీకాకుళం, నేటి పత్రిక ప్రజావార్త : విజయవాడ మరియు విశాఖపట్నం మధ్య ఉదయపు విమాన సర్వీసులను జూన్ 1వ తేదీ నుండి తిరిగి ప్రారంభించనున్నట్టు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. రాష్ట్ర ఆర్థిక రాజధాని విశాఖపట్నం నగరం నుండి రాజధాని విజయవాడ ప్రాంతం మధ్య విమాన సర్వీస్ తిరిగి ప్రారంభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుత షెడ్యూల్ ప్రయాణికులకు మరింత సౌలభ్యం కలిగించేలా రూపొందించబడిందని తెలిపారు. ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానం విమానం విజయవాడ నుండి ఉదయం 7:15 గంటలకు బయలుదేరి, ఉదయం 8:25 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది అని. తిరుగు ప్రయాణంలో విశాఖపట్నం నుండి ఉదయం 8:45 గంటలకు బయలుదేరి, ఉదయం 9:50 గంటలకు విజయవాడకు చేరుకుంటుంది అని తెలిపారు. ప్రాంతీయ విమాన కనెక్టివిటీని బలోపేతం చేయడం, అభివృద్ధి చెందుతున్న నగరాల మధ్య వేగవంతమైన రవాణా సౌకర్యాన్ని కల్పించడం తమ మంత్రిత్వ శాఖ యొక్క ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధి, ప్రయాణికుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఈ కీలక సర్వీసును తిరిగి అందుబాటులోకి తీసుకురావడం ఎంతో సంతోషకరమైన విషయమని తెలిపారు.

# సుస్థిర పర్యాటకంలో ఆంధ్రప్రదేశ్ సరికొత్త అడుగు - 500 హోమ్‌స్టేలతో గిరిజన, గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి

*-త్వరలో రాష్ట్ర హోమ్‌స్టే విధానం*

అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : పర్యాటక మరియు సుస్థిర అభివృద్ధిని ప్రోత్సహించే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందడుగు వేసింది. గిరిజన, సాంస్కృతిక వారసత్వ, గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాలలో 500కి పైగా హోమ్‌స్టేలను గుర్తించింది. ఈ హోమ్‌స్టేలలో అరకు లోయలోని (వంతమూరు, మగడ, కురిడి, తజంగి) గిరిజన ప్రాంతాలు, కోనసీమలోని దిండి సమీపంలో (పసర్లపూడి, మల్కిపురం, తురుపుపాలెం) వారసత్వ గృహాలు మరియు తిరుపతి, విశాఖపట్నం, విజయవాడ వంటి పట్టణ కేంద్రాలలోని గృహాలు ఉన్నాయి. వీటినన్నింటినీ ఆగస్టు 2025 నాటికి క్రమంగా అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించబడ్డాయి. అంతేకాకుండా, తిరుపతిలో ఇప్పటికే ఉన్న దాదాపు 600 హోమ్‌స్టేలు ఎయిర్‌బీఎన్‌బీ, ఓయో హోమ్స్, యాత్రాధామ్, హోమ్‌స్టేస్ ఆఫ్ ఇండియా మరియు మేక్‌మైట్రిప్ వంటి ప్రముఖ ప్లాట్‌ఫామ్‌ల సహకారంతో నాణ్యతా పెంపు పై శిక్షణ జరగనుంది. ఈ కార్యక్రమం SERP, MEPMA, భారత ప్రభుత్వం మరియు మాస్టర్‌కార్డ్ వంటి ప్రధాన రాష్ట్ర భాగస్వాములతో సమన్వయంతో నడుస్తోంది. దీని ద్వారా ప్రతీ ప్రాంతంలో పర్యాటకాన్ని జీవనోపాధి మరియు స్థానిక ప్రజలకు బలమైన సాధనంగా మార్చడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. హోమ్‌స్టేలలో అత్యున్నత ప్రమాణాలు కొనసాగేలా చూసుకోవాలని పర్యాటక శాఖకు ముఖ్యమంత్రి సూచించారు. అలాగే, ప్రధాన పర్యాటక ప్రదేశాల చుట్టూ "వర్క్ ఫ్రమ్ హోమ్" అవకాశాలను అభివృద్ధి చేయాలని ఆదేశించారు. ఈ సమగ్ర హోమ్‌స్టే కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ యొక్క విశాల దృష్టిలో భాగం. దీని ద్వారా స్తానిక ప్రజలకు సాధికార శక్తినిస్తూ, మన సంపద అయిన సాంస్కృతిక, గిరిజన మరియు మన పర్యావరణాన్ని అభివృద్ధి చేయవచ్చు. రాబోయే రాష్ట్ర హోమ్‌స్టే విధానం నైపుణ్య నిర్మాణం, అనుభవాల సమీకరణ మరియు ప్రపంచ వ్యాప్త ప్రచారానికి వ్యవస్థలను బలోపేతం చేస్తుంది. అరకు అడవుల దగ్గర నుండి కోనసీమ పల్లెటూళ్ళు, దక్షిణ ఆంధ్ర దేవాదాయ పట్టణాల వరకు ప్రతీ హోమ్ స్టే ఆ ప్రాంతపు విశిష్టతను ప్రతిబింబిస్తుంది. జిల్లా అధికారులు, స్థానిక ప్రజలు అందరూ కలిసి పనిచేయడం వల్ల ఆంధ్రప్రదేశ్ పర్యాటకంలో కొత్త అధ్యాయం మొదలవుతోంది. ఇది కేవలం పర్యాటకులకు మాత్రమే కాదు, స్థానిక ప్రజలకు కూడా లాభదాయకంగా, వారి సంస్కృతిని, పర్యావరణాన్ని కాపాడుకునేలా చేస్తూ ఆంధ్రప్రదేశ్ ను పర్యాటకంలో ఒక అగ్రగామిగా నిలబెట్టనుంది.

# సమగ్ర అభివృద్ధిని సాధించే దిశగా ఆంధ్రప్రదేశ్



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : అమరావతి నిర్మాణానికి మరియు రాష్ట్రవ్యాప్తంగా రూ. 58,000 కోట్ల విలువైన ఇతర ముఖ్యమైన ప్రాజెక్టులకు పునాది రాయి వేసినందుకు ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ (APఛాంబర్స్) కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలకు ధన్యవాదాలు తెలియజేస్తోంది. AP ఛాంబర్స్ అధ్యక్షుడు పోట్లూరి భాస్కర రావు మాట్లాడుతూ, "అమరావతిలో వివిధ ప్రాజెక్టుల ప్రారంభోత్సవానికి గౌరవనీయ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ గారి పర్యటన జాతీయ మరియు అంతర్జాతీయ పెట్టుబడిదారులకు విశ్వాసాన్ని కలిగించిందని మేము నమ్ముతున్నాము. అమరావతి ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థిక కార్యకలాపాలకు ప్రధాన చోదక శక్తిగా ఉంటుందని మరియు రాష్ట్రంలోని వివిధ రంగాలపై బహుళ ప్రభావం చూపుతుందని మేము విశ్వసిస్తున్నాము." "ప్రధాన మంత్రి మరియు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇద్దరూ అమరావతి మరియు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి తమ నిబద్ధతను పునరుద్ఘాటించడంతో పౌరులు నైతిక మద్దతు పొందారు. దీనితో, రాష్ట్రం ఆర్థిక మరియు సమగ్ర అభివృద్ధిని సాధించే దిశగా వేగవంతమైన మార్గంలో పయనిస్తోంది" అని ఆయన అన్నారు.

# భారతదేశం-యుకె స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని స్వాగతించిన ఏపీ ఛాంబర్స్

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : భారతదేశం మరియు యునైటెడ్ కింగ్డమ్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని (FTA) ఏపీ ఛాంబర్స్ అధ్యక్షుడు పోట్లూరి భాస్కర రావు స్వాగతించారు. ఈ ఒప్పందం ఎగుమతులను పెంచడానికి, ఉపాధిని కల్పించడానికి మరియు భారతదేశ ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడానికి ఒక చారిత్రాత్మక అడుగు అని ఆయన అభివర్ణించారు. ఈ సందర్భంగా భాస్కర రావు మాట్లాడుతూ, "ఈ ఎఫ్టీఏ భారతదేశం నుండి జరిగే 99% ఎగుమతులపై సుంకం రహిత ప్రవేశాన్ని అందిస్తుంది. తద్వారా ఆంధ్రప్రదేశ్కు కీలకమైన వస్త్రాలు, ఫార్మా, లెథర్, సముద్ర ఉత్పత్తులు, ఇంజనీరింగ్ వస్తువులు మరియు ఆహార ప్రాసెసింగ్ వంటి రంగాలకు గొప్ప అవకాశాలు లభిస్తాయి. ప్రపంచ మాంద్యం మరియు రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కారణంగా గత కొన్నేళ్లుగా చాలా రంగాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఈ ఒప్పందం మన ఎంఎస్ఎంఈలు మరియు ఎగుమతిదారుల ఆర్థిక కార్యకలాపాలను మరియు ప్రపంచ పోటీతత్వాన్ని గణనీయంగా పెంచుతుంది" అని అన్నారు. సేవల రంగంలోని ప్రయోజనాలను ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, "భారతదేశం ఐటీ, ప్రొఫెషనల్ మరియు ఎడ్యుకేషనల్ సర్వీసెస్లో బలమైన హామీలను పొందింది. నిపుణుల కదలిక సులభతరం చేయబడింది మరియు భారతీయ సేవా ప్రదాతలు మరింత పోటీగా ఉండేలా యుకె సామాజిక భద్రతా సహకారాల నుండి మూడేళ్ల మినహాయింపు లభించింది. ఇది ఆంధ్రప్రదేశ్లోని నిపుణులు మరియు యువతకు అనేక అవకాశాలను తెరుస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. వికసిత్ భారత్ 2047 విజన్‌కు అనుగుణంగా, ఇప్పటివరకు కుదిరిన అత్యంత సమగ్రమైన ఎఫ్టీఏను ముగించినందుకు భాస్కర రావు భారత ప్రభుత్వాన్ని అభినందించారు. "ఈ ఒప్పందం గ్లోబల్ వాల్యూ చైన్స్‌లో భారతదేశ పాత్రను బలపరుస్తుంది మరియు ఆధునిక వాణిజ్య భాగస్వామ్యాలకు ఒక కొత్త ప్రమాణాన్ని నెలకొల్పుతుంది" అని ఆయన అన్నారు. ఈ మైలురాయిని వృద్ధి మరియు ప్రపంచ అనుసంధానం కోసం ఉపయోగించుకోవడానికి వ్యాపారాలకు మద్దతు ఇవ్వడానికి ఏపీ ఛాంబర్స్ సిద్ధంగా ఉందన్నారు..

# ఏపీలో 98 మంది ఎస్సీ, ఎస్టీ సెల్ పోలీస్ స్టేషన్ల డిఎస్పీలను వెంటనే నియమించాలి

*సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ జోక్యం చేసుకొని రాష్ట్రంలో డిఎస్పీలను నియమించాలి*

*-బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు చందు*



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2024 సంవత్సరంలో గుట్టు చప్పుడు కాకుండా 98 మంది ఎస్సీ, ఎస్టీ స్పెషల్ పోలీస్ స్టేషన్ల డిఎస్పీలను రాష్ట్రవ్యాప్తంగా పోస్టింగ్లను రద్దు చేసిందని, దళితులకు అన్యాయం జరుగుతుందని బహుజనసేన రాష్ట్ర అధ్యక్షుడు చందు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్త పర్యటన ముగించుకుని సోమవారం విజయవాడ, ధర్నాచౌక్ నందు వందలాదిమందితో మహాధర్నా కార్యక్రమాన్ని బహుజన సేన ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వారు మాట్లాడుతూ... ఈ స్పెషల్ డిఎస్పీల వ్యవస్థను ఎస్సీ ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టాన్ని బలపరచడానికి, ఎస్సీ ఎస్టీ బాధితుల వర్గానికి మెరుగైన సత్వర న్యాయాన్ని అందించడానికి, పటిష్టంగా ఈ చట్టాన్ని అమలు చేయడానికి జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫారసుల ద్వారా 2014వ సంవత్సరంలో ఈ స్పెషల్ డిఎస్పీల వ్యవస్థను ఏర్పాటు చేశారని తెలియజేశారు. ఈ ఎస్సీ, ఎస్టీ సెల్ డిఎస్పిలను 2024లో పోస్టింగులు రద్దు చేసినప్పటికీ... కొత్త ప్రభుత్వం బాధ్యతలు తీసుకున్న తర్వాత ఈ విషయం వారికి తెలిసిన... ఏమాత్రం సమస్య పరిష్కార దిశగా స్పందన లేదని వీరు ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కచ్చితంగా న్యాయపోరాటానికి సిద్ధమవుతామన్నారు. కావున సత్వరమే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ సమస్య పట్ల చొరవచూపి ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టాన్ని, ఎస్సీ, ఎస్టీ బాధితుల పరిరక్షణ కోసం పటిష్టంగా ఏర్పాటు చేసిన ఎస్సీ, ఎస్టీ సెల్ డిఎస్పీల వ్యవస్థని పునరుద్ధించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు విజయకుమార్ ఐఏఎస్ మాట్లాడుతూ...కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల మధ్య కుల, మత విద్వేషాలకు రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని రాజకీయకక్షలకు వాడుకుంటూ దానిని నిర్వీర్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక ఎస్సీ, ఎస్టీ సెల్ పోలీస్ స్టేషన్లకు డీఎస్పీలను నియమించాలన్నారు. మనువాదాన్ని మరలా తీసుకువచ్చేందుకు కుట్రలు పన్నుతున్నారన్నారు. ఈ మహాధర్నా కార్యక్రమంలో కేవీపీస్ మాల్యాద్రి, రిపబ్లిక్ సేన ప్రెసిడెంట్ రాయ్యప్ప, డిహెచ్ పిఎస్ బుజ్జి రాయప్ప, బహుజన సేన నాయకులు గోవిందప్ప, జయ శంకర్, వరలక్ష్మి, బహుజన సేన మైనారిటీ అధ్యక్షులు నూర్ ఆలాం, తదితర సంఘాలు నేతలు పాల్గొన్నారు.

# కరెంట్ ఛార్జిలను వెంటనే తగ్గించాలి



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : స్థానిక విజయవాడ నియోజకవర్గం, 47వ డివిజన్ కె ఎల్ రావు నగర్ లోని సబ్ స్టేషన్ నందు మాజి మంత్రి, పశ్చిమ వైసిపి ఇంచార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు సూచనల మేరకు విద్యుత్ అధికారులను కలిసి పెంచిన కరెంట్ ఛార్జిలను వెంటనే తగ్గించాలని వినతి పత్రం అందజేసిన శాసన మండలి సభ్యులు Md రుహుల్లా, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితర వైసిపి నాయకులు.. ఈ సందర్భంగా నగర మేయర్ రాయనా భాగ్యలక్ష్మి, శాసన మండలి సభ్యులు Md రుహుల్లా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అసిఫ్, దుర్గ గుడి మాజి చైర్మన్ కర్నాటి రాంబాబు లు మాట్లాడుతూ గతంలో జగన్ మోహన్ రెడ్డి గారి హయాంలో కూటమి పార్టీ లు బాదుడే బాదుడే అన్ని కాకి గోల పెట్టి కూటమి ప్రభుత్వం వస్తే ప్రజలపై ఎటువంటి భారం పడకుండా ప్రజలకు మంచి పరిపాలన అందిస్తామని, ప్రజలను ఉద్ధరిస్తాము అని చెప్పి అధికారంలోకి వచ్చిన నాలుగు అయిదు నెలలకే ఇంటింటికి ఇది మంచి ప్రభుత్వం అని పోస్టర్లు అంటించుకొని సొంత డబ్బా కొట్టుకున్నారన్నారు. నేడు ప్రజలపై అన్ని రకాలుగా భారం మోపుతున్నారన్నారు. మూత పడి, మీటర్లు కూడా ఆఫ్ చేపించుకున్న ఇంటికి కూడా 5 వందల 54 రూపాయలు విద్యుత్ చార్జీలు మోపి కరెంట్ బిల్ ఇచ్చారన్నారు. గతంలో వాడిన కరెంట్ కి నేడు విద్యుత్ చార్జీలు మోపారు ఇదెక్కడి సౌద్యం అన్ని ప్రశ్నించారు. విజయవాడ నగరంలో గాని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గాని అనేక మంది దిగువ తరగతిలో ఉన్నారని వారి ఇలా విద్యుత్ చార్జీలు వేస్తె ప్రజలు ఏ విధంగా చెల్లించగలరని అన్నారు. ఈ విధంగానేనా ప్రజలను కూటమి ప్రభుత్వం ఉద్దరించేది అన్ని విమర్శించారు. జగన్ మోహన్ రెడ్డి గారి హయాంలో 2 రూపాయల 49 పైసలకి విద్యుత్ చార్జీల ఒప్పొందం కుదుర్చుకుంటే నానా యాగీ చేసి గోల చేసి ఇష్టం వచ్చినట్లు బాదుడే బాదుడు అన్ని మాట్లడిన కూటమి పార్టీలు నేడు కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చిన తరువాత సెకితో 4 రూపాయల 69 పైసలకి ఒప్పొందం చేసుకొని ప్రజల పై భారం మోపుతూ, జీవో నెం 108 ప్రకారం అమలు చేస్తూ ప్రజలను అన్ని రకాలుగా ఇబ్బంది పెడుతున్నారన్నారు. రాష్ట్రంలో ఒక్క కరెంట్ చార్జీలే కాదు నిత్యావసర సరుకుల ధరలు పెంచుతున్నారని, ఉచిత గాస్ బండలు అని గాస్ బండ్ల ధరలు పెంచేస్తున్నారని, అన్ని విధాలుగా ప్రజలపై బారాలు మోపుతున్నారన్నారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ అన్నారు, ఒక్క హామీ కూడా అమలు చేయట్లేదన్నారు. ఉన్న పెన్షన్లకు కూడా కోత విదిస్తున్నారన్నారు. సర్వేలు పేరుతొ ఎప్పుడినించో ఉన్న పెన్షన్లను తొలగిస్తున్నారన్నారు. ఈ రోజు ఉన్న పెన్షన్ రేపు ఉంటదో ఉండదో అన్ని ముసలి ముతక, వికలాంగులు, ప్రజలు గుండెలు అర చేతిలో పెట్టుకొని బతకాల్సిన పరిస్థితి కూటమి ప్రభుత్వం లో నెలోకొందన్నారు. అమరావతి అనే భ్రమరావతిని అభివృద్ధి చేస్తే ప్రజలందరూ ఆనందంగా ఉంటారనే భ్రమలో కూటమి పరిపాలన ఉందన్నారు. జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నేడు అన్ని సబ్ స్టేషన్ లోని విద్యుత్ శాఖ అధికారులను కలిసి ప్రజల పై విద్యుత్ చార్జీల పేరుతొ మోపిన అధిక భారాన్ని తొలగించాలని కోరుతూ వినతి పత్రం అందజేయడం జరిగిందన్నారు. గతంలో రాజశేఖర్ రెడ్డి గారి హయంలో రైతులకు ఉచిత కరెంట్ వంటి అనేక మంచి కార్యక్రమాలు చేసారని గత చంద్రబాబు నాయుడు హయాంలో కరెంట్ తీగల పై బట్టలు ఆరేసుకునే పరిస్థితి వచ్చిందని మరల రానున్న రోజులో పెంచిన కరెంట్ చార్జీలను ప్రజలు కట్టలేక అదే పరిస్థితి వస్తుందని కొవొత్తుల వినియోగం చేసే రోజులు దగ్గరలోనే ఉన్నాయని జోస్యం చెప్పారు వెంటనే విద్యుత్ చార్జీలను తగ్గించాలని లేదంటే ప్రజలతో కలిసి ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. జగన్ మోహన్ రెడ్డి గారి హయంలో అనేక మంచి పధకాలు అమలు చేసారని నేడు ప్రజలకు ఉపయోగపడే కనీస హామీలు కూడా అమలు చేయకుండా చార్జీల పేరుతొ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. గతంలో పాలన పై, అభివృద్ధి పై, అమలు చేసిన సంక్షేమ పధకాల పై నేడు చేస్తున్న వాటిపై డిబేట్ కు సిద్ధమా అని సవాలు విసిరారు. కూటమి ప్రభుత్వం సంవత్సర కలలోనే విఫలం చెందిందని జగన్ గారు మాకు మంచి చేస్తే ఈ కూటమి పార్టీ లను నమ్మి జగన్ గారిని మోసం చేశామని ప్రజలు చెపుతున్నారన్నారు. వైసిపి నేతలు గతంలో మేము చేసిన మంచిని ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు వివరించామని ఇప్పుడు టిడిపి నేతలను కూడా ఆ విధంగా తిరిగే దైర్యం ఉందా అన్ని ప్రశ్నించారు. మధ్య తరగతి కుటంబం నెలకు సుమారు 20 వేల సంపాదిస్తే కరెంట్ కి 5 వందలు, నిత్యావసర సరుకులకు 5 వేలు, ఇంటి అద్దెకు 5 వేలు అని దేనికి దానికి సర్దుకొని జీవనం కొనసాగిస్తారని అలంటి వారి పై ఉన్నటుండి చార్జీల పెంపు పేరుతొ 5 వందలు వచ్చే కరెంట్ బిల్లు 5 వేల దాకా వస్తే మిగిలిన 4 వేళ 5 వందల రూపాయలు ఎక్కడినుంచి తీసుకొని వచ్చి కడతారని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్ గారు ఎ ప్యాలస్ లో దాక్కున్నారో తెలియడం లేదని అన్నారు. చార్జీలు, ధరలు పెంపు పేరుతొ ప్రజలను ఇబ్బంది పెడ్తుతున్న కూటమి వైఖరిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ అసిఫ్, దుర్గ గుడి మాజి చైర్మన్ కర్నాటి రాంబాబు, స్థానిక డివిజన్ కార్పొరేటర్ గోదావరి గంగ, వక్ఫ్ బోర్డు జిల్లా మాజి చైర్మన్ గౌస్ మోహిద్దీన్, అర్టిజెన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు తోలేటి శ్రీకాంత్, బొందిలి సంగం రాష్ట్ర అధ్యక్షులు నరేంద్ర సింగ్, డివిజన్ అధ్యక్షులు కూరాకుల నాగ, మాజీ డైరెక్టర్ లు దేరంగుల రమణ, సీరం వెంకట్రావు, మాజీ శ్రీనివాసరావు, రాష్ట్ర ఎస్సి సెల్ ఉపాధ్యక్షులు బూదాల శ్రీనివాసరావు, పలు డివిజన్ల కార్పొరేటర్ లు, ఇంచార్జ్ లు బాపతి కోటిరెడ్డి, తంగెళ్ల రామచంద్రరావు, గురుమహంతు మహేష్, రాష్ట్ర, జిల్లా మరియు నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, క్లస్టర్ ఇంచార్జ్ లు తదితర వైసిపి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు

# మద్యం కుంభకోణంలో సంబంధించిన వారిపై విచారణ చేయాలి...

*: నేతి ఉమామహేశ్వరరావు*



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : మద్యం కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి తో విజయవాడ ఎంపీ కేసినేని చిన్నికి సంబంధించిన వ్యక్తులు వ్యాపార లావాదేవీలు ఉన్నాయని వస్తున్న ఆరోపణలపై సీబీఐ విచారణ జరపాలని ఆమ్ ఆద్మీ పార్టీ జోనల్ కోఆర్డినేటర్ నేతి ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం గాంధీనగర్లోని ప్రెస్ క్లబ్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం తాలూకా సుమారు 3200 కోట్లకు పైగా నిధులు మద్యం కంపెనీలనుంచి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సలహాదారుడైన కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి ద్వారా సేకరించారు అన్న ఆరోపణలు వచ్చిన పరిస్థితుల మీద విచారణ చేస్తున్న సిట్ నివేదిక ప్రకారం కొత్త మద్యం విధానం వలన లబ్ది పొందిన మద్యం కంపెనీలనుంచి కిక్ బ్యాక్ ల ద్వారా వచ్చిన అవినీతి డబ్బును డొల్ల కంపెనీల ద్వారా హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో రియల్ ఎస్టేట్లో పెట్టడం జరిగిందన్నారు. కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి పై విచారణ జరుగుతున్న సమయంలో, చిన్ని కుటుంబ సభ్యులు, కాసిరెడ్డి కలిసి "ప్రైడ్ ఇన్ఫ్రా ప్రి ఎల్ఎల్పి" అనే కంపెనీ గతంలో ప్రారంభించిన విషయం బయటకి వచ్చిందని అన్నారు. 3200 కోట్లు సంబంధించి డబ్బులను సేకరించే పరిస్థితిలో కసిరెడ్డి అలాగే టిడిపి నాయకుడు అయి ఉండి అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సలహాదారులుగా ఉన్న కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి తో కలిసి వ్యాపారం చేసే పరిస్థితులలో కేశినేని చిన్ని ఉన్నారా అని ప్రశ్నించారు. వీళ్లిద్దరు కూడా బినామీలే వీళ్ళ మీద బినామీ చట్టం ఉపయోగించి వీళ్ళిద్దరి వెనక ఉన్న పెద్ద తలకాయలు ఎవరు అన్నది రాష్ట్ర ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయాన్ని మాజీ ఎంపీ కేశినేని నాని కూడా సోషల్ మీడియాలో వెల్లడించినట్లు తెలిపారు. అలాగే నాని, మరిన్ని డొల్ల కంపెనీల వివరాలను కూడా బయటపెట్టారని అన్నారు. ఈ స్థితిలో టీడీపీ నాయకత్వం చిన్ని పై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. చిన్ని పై ఇన్ని ఆరోపణలు ఉన్న నేపథ్యంలో సీబీఐ విచారణ చేపట్టాలన్న డిమాండ్తో త్వరలోనే కేంద్రానికి లేఖ రాస్తామన్నారు. మద్యం కుంభకోణంలో మని ల్యాండరింగ్ దాగుందన్నారు. దీనిపై సీబీఐ, ఈడీ విచారణ జరగాలని డిమాండ్ చేశారు.

# కలలు కనండి.. కథలు చెప్పండి

*ఆరెంజ్ ఎకానమీ అభివృద్ధికి తొలిమెట్టు*

డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : కలలు కనండి. సృజనాత్మక కథలు చెప్పండి.ప్రపంచానికి మార్గదర్శనం చేయండి అంటోంది " వేవ్స్ "సమ్మిట్. సృజనాత్మక కంటెంట్ సృష్టితో భారత్లో నారింజ ఆర్థిక వ్యవస్థ ఆవిర్భవించింది. సంస్కృతి,కళ మేధోవిలువ కలిగిన వస్తువులు, సేవలు ఉత్పత్తినే ఆరెంజ్ ఎకానమీ అంటారు. ఇది భారత్ దేశం జీడీపీలో దాదాపు మూడు శాతం పైగా కలిగి ఉంది. అత్యాధునిక పరిజ్ఞానం ఉపయోగించుకుని సేవలు ఉత్పత్తిని పెంచటమే లక్ష్యంగా "వేవ్స్" ఆవిర్భవించింది. 100 కుపైగా దేశాలనుంచి కళాకారులు, పెట్టుబడిదారులు, విధాన రూపకర్తలు బొంబాయిలో ఇటీవల జరిగిన మొదటిసభకు హాజరయ్యారు. ఈ సభకు ముఖ్య అతిథిగా వచ్చిన ప్రధాని మోదీ ప్రపంచ కేంద్రంగా భారత్లో ఆరెంజ్ వ్యవస్థ అభివృద్ధి చెందుతున్నదని పేర్కొనడం విశేషం. చలనచిత్ర నిర్మాణం, డిజిటల్ కంటెంట్, గేమింగ్, ఫ్యాషన్, సంగీతం, స్టోరీ టెల్లింగ్, యానిమేషన్,ప్రత్యక్ష కచేరీలకు భారత్ కేంద్రంగా ప్రపంచానికి మార్గదర్శనం చేస్తున్నది. ప్రపంచ సృష్టికర్తలు వారు కన్న కలలు, కథలను చెప్పాలి. పెట్టుబడిదారులు వేదికలపైనే కాదు,ప్రజలలో కూడా పెట్టుబడి పెట్టాలి. భారతీయ యువత విజయగాథలు, కథలను లక్షల్లో ప్రపంచానికి చెప్పాలి. కంటెంట్ సృష్టి లో యువత ప్రధాన పాత్ర వహించాలని మోదీ ఆకాంక్షించారు. యువతలో సృజనాత్మకత స్వేచ్ఛగా ప్రవహిస్తున్నది. వారి శైలి,స్ఫూర్తికి ఎలాంటి హద్దులు ఉండవు. అందువల్ల కంటెంట్ సృష్టికి వీరే కర్తలుగా నమ్ముతానని మోదీ అనడం విశేషం. వేవ్స్ అనేది సంస్కృతి, సృజనాత్మకత, సార్వత్రిక అనుసంధాన తరంగం. ఇది భారతీయ సృజనాత్మక బలాలను ప్రపంచ వేదికపై వ్యక్తీకరిస్తుంది. వేవ్స్ ప్రపంచ ఆడియో విజువల్, వినోద సమ్మిట్ కంటే ఎక్కువే. బిలియన్ కంటే ఎక్కువ జనాభా ఉన్న భారతదేశం బిలియన్ కంటే ఎక్కువ కథలకు నిలయంగా ఉంది. వేయి సంవత్సరాల కథల నిధిని కలిగి ఉంది. బొంబాయి వేవ్స్ మొదటి సమ్మిట్ ప్రపంచ వ్యాప్తంగా మోతమోగించింది. ఈ సమ్మిట్ లో భారతీయ చలనచిత్ర ఉద్దండ నటులు, ప్రముఖ పారిశ్రామికవేత్త ముకేష్ అంబానీ తదితరులు పాల్గొన్నారు.నాలుగు రోజులు పాటు కేంద్ర ప్రసార సమాచార శాఖ నిర్వహించింది. కంటెంట్ సృష్టికర్తలు అన్ని విభాగాల నుంచి అనుసంధానించే లక్ష్యంతో మీడియా, వినోద రంగాలను విస్తరించింది. భారత్లో సృష్టించడానికి, ప్రపంచం కోసం సృష్టించడానికి ఇది సరైన సమయంగా ప్రధాని అభిప్రాయపడ్డారు. ఈ భావన కాలాతీతమైనది, ఆలోచింపజేసేదన్నారు. సృజనాత్మకత గేమింగ్, సంగీతం, చిత్రనిర్మాణలలో తరచూ మనకి కనిపిస్తుంది . ఈ సృజనాత్మకతే భారతీయ జీడీపీని వృద్ధి చేస్తుందని అభిప్రాయ పడ్డారు. ప్రపంచ సృష్టికర్తలు భారతదేశాన్నికంటెంట్ మైదానంగా చేసుకుని కథ చెప్పే సామర్థ్యం పై పెట్టుబడి పెట్టాలని ప్రధాని పెట్టుబడిదారులను ఆహ్వానించడం గమనార్హం.ప్రపంచ ప్రేక్షకులు కథలు చెప్పే కొత్త మార్గాలను కోరుకుంటున్నారని, భారత్ లో యువత దాన్ని సృష్టించాలని మోదీ పిలుపునిచ్చారు. భారతీయ సినిమాలు ప్రపంచ ప్రేక్షకులను చేరుకుంటున్నాయని,ఇటీవల ఓటీటీ ప్లాట్ ఫాంలు పదిరెట్లు పెరిగిన విషయం గుర్తు చేసారు. భారతదేశ కథలు ప్రపంచ నలుమూలలకు చేరేలా చూడాలన్నారు. పారిశ్రామికవేత్త ముకేష్ అంబానీ వినోదాన్ని మృదువైన శక్తిగా కాకుండా నిజమైన శక్తిగా మారుతుందనడంలో అనుమానం లేదన్నారు. రామాయణం, మహాభారతం వరకూ భారత్ కు కథలు చెప్పే శక్తి ఏ దేశానికి లేదన్నారు.ఇవి భారత్తో పాటు ప్రపంచాన్ని ఒక్కటిగా ఉంచే శక్తి ఉందన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ రంగ ప్రవేశంతో ఆరెంజ్ ఎకానమీ రూపురేఖలు మారనున్నాయి. భారత్ లో కటెంట్ సృష్టితో ఈ రంగం 100 బిలియన్ డాలర్లమార్కును దాటడం ఖాయమని చెప్పవచ్చు. ఉద్యోగితతో పాటు అభివృద్ధి జరిగి ఆదాయం పెరగడం ఖాయం.ఆరెంజ్ ఎకానమీ తో భారత్ అభివృద్ధిలో మరింత ముందుకు వెళ్లడమే కాక ప్రపంచ నాయకత్వం వహించే రోజు ఎంతో దూరంలో లేదు.

## ఐక్యతతో ముందుకు సాగుదాం... స్త్రీల సంక్షేమం కొరకు పాటుపడదాం... : ఆర్ ఆర్ గాంధీ నాగరాజన్



తెనాలి, నేటి పత్రిక ప్రజావార్త : రక్షించండి! రక్షించండి!! ప్రజా స్వామ్యాన్ని రక్షించండి!. బ్రతుకుదాం! బ్రతికిద్దాం!! బ్రతికించడం కోసం బ్రతుకుదాం! బ్రతికితే దేశం కోసం చస్తే దేశం కోసం అనే నినాదంతో నంది వెలుగు తెనాలి ప్రధాన రహదారి మార్గంలో గల ఆటోనగర్ లోని ఉమా సిల్వర్ వర్క్ షాపునుందు గాంధీ దేశం ట్రస్ట్ వ్యవస్థాపకులు ఆర్ ఆర్ గాంధీ నాగరాజన్ సత్యాగ్రహ రిలే నిరసన దీక్ష చేశారు. బుధవారం ఆమేరకు ఆర్ ఆర్ గాంధీ నాగరాజన్ మాట్లాడుతూ 77 ఏళ్ళ స్వతంత్ర్య భారత దేశంలో ప్రతినెలా 30వ తేదీన గాంధీ మృతి చెందిన రోజును స్మరించుకుంటూ వివిధ ప్రజాహిత కార్యక్రమాలు ద్వారా ప్రజలను చైతన్యపరిచే కార్యమాలు నిర్వహిస్తూ గాంధీ వేషదారణతో ముందుకు సాగుతున్నారు. ఆమేరకు ఆయన తొలుత గాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి కళ్లకు గంతులు కట్టుకుని రిలే నిరాహార దీక్షచేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ దేశ భద్రత ప్రతి పౌరుడు పై ఉందని, పహల్గామ్‌లో దాయాధులు చేసిన దాడులపై భారత దేశంలోని ప్రతి ఒక్కరు రక్త కన్నీరు పెడుతున్నారని పేర్కొన్నారు. భారతదేశం ప్రపంచ దేశాలతో పోటీపడుతూ దినదినా అభివృద్ధి చెందుతుందని, దాన్ని చూసి ఓర్వలేక దాయాదులు దాడులు చేస్తూ హిందూ-ముస్లీం మధ్య చిచ్చుపెట్టాలని చూస్తున్నారని కాని భారతీయులంతా కుల, మతాలకు అతీతంగా ఉగ్రవాదాన్ని నివారించేందుకు ఐక్యతతో ముందుకు సాగుతామని తెలిపారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు చేపట్టాని కోరారు. స్త్రీలకు స్వతంత్ర్యం నేటికీ లేదని బావితరాలు భవిష్యత్ సమాజ, స్త్రీరక్షణ లేని సమాజం సమాజం కానేకాదని ఆ తరహా విధానాలను ప్రోత్సహించే రీతిగా నాయకులు మారాలని విన్నవించారు. నేటికీ స్త్రీలు బానిసత్వంలోనే మగ్గుతున్నారని వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్త్రీల రక్షణ కొరకు బలమైన చట్టాలు తేవాలని కోరారు. అన్ని రంగాలలో స్త్రీలకు సమాన హక్కులు ఉండేలా చట్టాలు తీసుకురావాలని పేర్కొన్నారు. సమాజ హితం కోసం స్త్రీల సంక్షేమం కొరకు తాను దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రత్యేక ప్రచార రథం ద్వారా పలు ప్రాంతాల్లో పర్యటించే ఆలోచన ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు మహిళా అధ్యక్షురాలు ఆర్. ఎన్. శివరంజని, ట్రస్ట్ ఏపీ బాధ్యురాలు బంగారు భారతి తదితరులు పాల్గొన్నారు.

## వన్ టౌన్ వాగు సెంటర్ శ్రీ వీరాంజనేయ స్వామి వారి నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : వన్ టౌన్ వాగు సెంటర్ శ్రీ వీరాంజనేయ స్వామి వారి నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం ఆది వారం ధ్వజస్తంభ దాత పోతిన వెంకట మహేష్, విజయలక్ష్మి దంపతుల స్వహస్తములతో దేవాదాయ శాఖ దేవస్థానం ఈవో వై. సీతారామయ్య సమక్షంలో దేవస్థాన అర్చకులు పరాశరం పవన్ కుమార్ చార్యు లు, మరియు విన్నకోట శ్రీనివాసరావు శర్మ పర్యవేక్షణలో మురికిపూడి మణిదీప్ శిష్య బృందముతో వైకాసన ఆగమొక్తముగా త్రయాణాహిక దీక్షతో జరుపుటకు శ్రీ వీరాంజనేయ స్వామి వారి అనుజ్ఞ అయి ఉన్నది కావున భక్తులు శ్రీ స్వామివారి ధ్వజస్తంభా ప్రతిష్ట లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి అనుగ్రహమును పొందగలరు,

## నగరంలో ఎపీఎంసీఎ నిరసన కార్యక్రమం



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : నగరంలో ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్/ కమ్యూనిటీ హెల్త్ ఆఫర్స్ అసోసియేషన్ (ఎపీఎంసీఎ) నిరసన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం విజయవాడ ధర్నా చౌక్ సమీపంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ విలేజ్ హెల్త్ క్లినిక్స్ లో గత 7 సంవత్సరాలుగా ప్రజలకు పంచాయితీ పరిధిలో ఆరోగ్య సేవలను అందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ కు ఆర్థికంగా, అర్థికేతర సమస్యల పరిష్కారం, రావలసిన బెనిఫిట్స్ కోసం చెప్పట్టిన సమ్మె 6 వ రోజుకు చేరడం అయింది. డిమాండ్స్ హౌఅయిన 6 సంవత్సరములు ప్రతి చేసుకున్న సి హెచ్ ఓలను రెగ్యులర్ చేయడం, ఎన్ హెచ్ ఎం 23 హైక్ అమలు చేయడం, ఇంక్రిమెంట్ పాలసీ ప్రారంభించడం, ఈ పిఎఫ్ ఓ బెనిఫిట్ ను పునరుద్ధరించడం, ఎక్స్ గ్రేషియా పాలసీ అమలు చేయడం, నిర్దిష్టమయిన జాబ్ చార్ట్ అమలు చేయడం మరియు ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేని పక్షంలో సమ్మెలు మరింత ఉధృతంగా రాష్ట్ర వ్యాప్తంగా చేపడతామన్నారు. అదే విధంగా సమస్యల పరిష్కారం కోసం హెల్త్ మినిస్టర్ దగ్గరికి పోతే, జాబ్ తీసేస్తాం, మీరు కాంట్రాక్టు ఉద్యోగులు అని బెదిరింపు దోరణిలో, సిహెచ్ఓ ల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి మాటలను అసోసియేషన్ తరుపున ఖండిస్తున్నాం అని, తన మాటలను వెంటనే వెనిక్కి తీసుకోవాలని, చర్చలు జరిపి తగు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు సందీప్ కుమార్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రెసిడెంట్ వర్షిణీ, జనరల్ సెక్రటరీ నవీన్, సురేష్, భవ్య, మౌలాలి, మహేశ్వరి, పలువురు హెల్త్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ యాత్రికుడు అన్వేష్‌పై హైదరాబాద్‌లో కేసు నమోదు

డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : ప్రపంచ యాత్రలు చేస్తూ, తన యూట్యూబ్ ఛానెల్ ద్వారా తెలుగు ప్రజలకు సుపరిచితుడైన యూట్యూబర్ అన్వేష్‌పై సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. రాష్ట్ర ప్రభుత్వంలోని ఉన్నతాధికారులపై తీవ్ర ఆరోపణలు చేస్తూ, అవాస్తవ సమాచారంతో కూడిన వీడియోను ప్రచారం చేశారనే అభియోగంపై పోలీసులు సుమోటోగా ఈ కేసును స్వీకరించారు. తెలంగాణ డీజీపీ జితేందర్, హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, సీనియర్ ఐఏఎస్ అధికారులు శాంతికుమారి, దానకిశోర్, వికాస్‌రాజ్ తదితరులు హైదరాబాద్ మెట్రోలో బెట్టింగ్ యాప్‌ల ప్రచారానికి అనుమతులు ఇచ్చే నెపంతో రూ.300 కోట్లు అక్రమంగా ఆర్జించారని ఆరోపిస్తూ అన్వేష్ తన యూట్యూబ్ చానెల్‌లో ఓ వీడియోను పోస్ట్ చేశాడు. ఈ వీడియోలో చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, తప్పుడు సమాచారంతో కూడిన వని సైబర్ క్రైమ్ పోలీసులు గుర్తించారు. సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌కు చెందిన ఓ కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ ఎఫ్ఐఆర్ నమోదైంది. సదరు వీడియో ప్రజల్లో గందరగోళం సృష్టించే ఉద్దేశంతో ఉందని, ప్రభుత్వ అధికారులు, చట్టబద్ధమైన సంస్థల ప్రతిష్ఠను దెబ్బతీసేలా, వారి పరువుకు భంగం కలిగించేలా ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికారుల విశ్వసనీయతను ప్రశ్నించేలా, ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత, ద్వేష భావాలను రెచ్చగొట్టేలా ఆ వీడియో ఉందని పోలీసులు అభిప్రాయపడ్డారు. తప్పుడు సమాచారాన్ని వ్యాప్తిచేసిన కంటెంట్ క్రియేటర్ అన్వేష్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

## మే 3న కెఎల్ యూనివర్సిటీ క్యాంపస్ ప్లేసెమెంట్ సక్సెస్ మీట్




విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : క్యాంపస్ ప్లేసెమెంట్స్‌లో కెఎల్ యూనివర్సిటీ విజయవాడ, హైదరాబాద్ క్యాంపస్ విద్యార్థులు అత్యుత్తమ వార్షిక ప్యాకేజీలతో ప్లేసెమెంట్స్ సాధించారని యూనివర్సిటీ ఉప కులపతి డాక్టర్ సారధివర్మ తెలిపారు. విజయవాడలోని యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కెఎల్ విద్యార్థులు పొందిన క్యాంపస్ ప్లేసెమెంట్స్ వివరాలను తెలియచేశారు. ఈ ఏడాది 75 లక్షల రూపాయల వార్షిక ప్యాకేజీతో తమ విద్యార్థి ప్లేసెమెంట్ సాధించటం గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు. 58 లక్షల రూపాయల ప్రీ ప్లేసెమెంట్ ఆఫర్‌తో పాటు తమ విద్యార్థులు అనేక రికార్డ్స్ సాధించారాని పేర్కొన్నారు. ఈ ఏడాది 5 వందలకు పైగా కంపెనీలు యూనివర్సిటీని సందర్శించి రాత పరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా విద్యార్థులను ఎంపిక చేసుకున్నారని చెప్పారు. ఈ ప్రక్రియలో భాగంగా 6 వేల మందికి పైగా విద్యార్థులు కంపెనీల నుంచి ఆఫర్ లెటర్స్ అందుకున్నారని, 4 వేల 7 వందల మంది విద్యార్థులు వివిధ ప్యాకేజీలలో ప్లేసెమెంట్స్ పొందారని వెల్లడించారు. 20 లక్షల నుంచి 50 లక్షల రూపాయల లోపు వార్షిక ప్యాకేజీలను 35 మందికి పైగా విద్యార్థులు దక్కించుకున్నారని, సూపర్ డ్రీమ్ కంపెనీలలో 150 మంది విద్యార్థులు ప్లేస్ అయ్యారని అన్నారు. ఈ ఏడాది జర్మనీ, జపాన్, సింగపూర్, దుబాయ్, మలేషియావంటి దేశాల్లో అంతర్జాతీయ ప్లేసెమెంట్స్ దక్కించుకున్నారని తెలియచేశారు.

యూనివర్సిటీ నైపుణ్యాభివృద్ధి విభాగం డీన్ డాక్టర్ శ్రీనాథ్ మాట్లాడుతూ 34 నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ద్వారా 452 మంది అధ్యాపకులు విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేలా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని అలాగే పారిశ్రామిక అనుబంధ శిక్షణ ఇవ్వటం ద్వారా తమ విద్యార్థులు నాణ్యమైన ప్లేసెమెంట్స్ పొందగలుగుతున్నారని స్పష్టం చేశారు. తమ యూనివర్సిటీ విద్యార్థులు క్యాంపస్ ప్లేసెమెంట్స్‌లో సాధించిన విజయాలను దృష్టిలో పెట్టుకుని విద్యార్థులందరిలో ఉత్సాహన్ని నింపేందుకు క్యాంపస్ ప్లేసెమెంట్స్ విజయోత్సవాన్ని మే 3వ తేదీన వడ్డేశ్వరంలోని యూనివర్సిటీ క్యాంపస్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ ప్లేసెమెంట్స్ విభాగం డీన్ ఎన్ బి వి ప్రసాద్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రఖ్యాత సంస్థలైన మైక్రోసాఫ్ట్, ఫ్లిప్ కార్ట్, అమెజాన్, సిస్కో వంటి కంపెనీలతో పాటు ప్రముఖ కార్పొరేట్ కంపెనీలకు చెందిన ప్రతినిధులు కూడా పాల్గొంటున్నారని చెప్పారు. కె ఎల్ విద్యాసంస్థలో చదివే ప్రతి ఒక్క విద్యార్థికీ క్యాంపస్ రిక్రూట్మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాం కింద ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని, తద్వారా విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందిస్తూ వారిని అత్యుత్తమ ప్యాకేజీలు పొందేలా ప్రణాళిక అమలు చేస్తున్నట్టు ఆయన చెప్పారు. ఈ సమావేశంలో యూనివర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జె. శ్రీనివాసరావు, ఎం హెచ్ ఎస్ విభాగం డీన్ డాక్టర్ కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## అందెల రవమిది పదములుదా



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : డాక్టర్ చింతారవి బాల కృష్ణ ఆధ్వర్యంలో ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య సంగీత కళాశాలలో రెండురోజులపాటు నిర్వహించే కూచిపూడి రంగ ప్రవేశ ఉత్సవాలు సోమవారం ముగిసాయి. కార్యక్రమంలో భాగంగా భువనసాయి లలిత నృత్యరంగ ప్రవేశంలో భాగంగా నాటరాగంలో నర్తనగణపతితో ప్రారంభించి, శివస్తుతి చిదంబరీ, స్తవం, పదము నగుమోము, ధిల్లానా అంశాలను ప్రదర్శించింది. నాట్యాచార్యులు హరిరామమూర్తి, సీహెచ్ శ్రీనివాస్, సంతోష్, నండూరి శంకర కోటేశ్వరరావు సంగీత విద్వాంసులు పోపూరి గౌరీనాథ్ ఆత్మీయంగా సత్కరించారు. డాక్టర్ చింతారవి బాల కృష్ణ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సంప్రదయాలు ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. భారతీయ నృత్య సంప్రదాయలను పరిరక్షించుకోవాలని కూచిపూడి నృత్య సంప్రదాయంలో రంగప్రవేశం ప్రధాన మైదని తెలిపారు. మోతుకూరి, మోతుకూరి రాంబాబు, లక్ష్మీశైలజ పాల్గొన్నారు.

## డీఎస్సీ అభ్యర్థుల సమస్యలు పరిష్కారించండి : డివైఎఫ్ఐ



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : డీఎస్సీ నోటిఫికేషన్ లో ఉన్న సమస్యలను పరిష్కరించి అభ్యర్థులందరికి న్యాయం చేయాలని లేని పక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం డివైఎఫ్ఐ (భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య) ఆధ్వర్యంలో విజయవాడలోని ధర్నాచౌక్ లో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి కృష్ణ అధ్యక్షతన జరిగింది. పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మద్దతుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఒక జిల్లాకు ఒకే పేపర్ ఉండాలని డిమాండ్ చేశారు. నర్మాలైజేషన్ వల్ల అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ లైన్ పరీక్షను రద్దు చేసి ఆఫ్ లైన్ లో పెట్టాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ అభ్యర్థుల ప్రిపరేషన్ కు తగిన సమయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. నోటిఫికేషన్ నాటికి కేవలం 45 రోజులు సమయం ఏ మాత్రం సరిపోవడం లేదన్నారు. అభ్యర్థుల అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ నోటిఫికేషన్ లేనందున అభ్యర్థులకు వయోపరిమితి 47సం లకు పెంచాలని డిమాండ్ చేశారు. డైట్, బీఈడి చేసి టెట్ లో అర్హత సాధించిన అభ్యర్థులకు డీఎస్సీ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఓపెన్ విద్య చదివిన వారికి డీఎస్సీలో అవకాశం ఇవ్వాలని కోరారు. డిగ్రీలో BSC లో CS చదివిన వారికి SA లో PS అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అధికారుల అనాలోచితమైన నిర్ణయాలు వల్ల అభ్యర్థులను బలి చేయడం తగదని అన్నారు. పీఈటీ పోస్టులు సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే డీఎస్సీ అభ్యర్థులకు టెక్నికల్ సమస్య వల్ల తీవ్ర మానసిక ఒత్తిడికి గురౌతున్నారని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు స్పందించి టెక్నికల్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు, డీఎస్సీ అభ్యర్థులు పాల్గొన్నారు.

## నా స్థలమును నాకు ఇప్పించండి ... : షేక్ జలీల్



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : తన స్థలమును తనకు ఇప్పించాలని నవరంగ్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు షేక్ జలీల్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌నందు విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరుజిల్లా నల్లపాడులో తనకు 250 చదరపు గజాల స్థలం ఉందని అందులో 70 చ.గ.లో రూములు, 150 చ.గ.లలో ఖాళీ స్థలం తన స్వాధీ నంలో ఉందని తెలిపారు. తనకు అవసరం అయ్యి 2016 సంవత్సరంలో గుంటూరు జిల్లా పరిషత్ సీఈఓ దగ్గర తన ఒరిజినల్ డాక్యుమెంట్స్ ఇచ్చి కొంత డబ్బు రొక్కముగా తీసుకున్నానని అన్నారు. అందుకు అగ్రిమెంట్ కూడా చేసుకున్నామని తెలిపారు. డబ్బు ఇచ్చేసి తన ఒరిజినల్ డాక్యుమెంట్ తీసుకుందామని వెళితే తనను బెదిరించారని వాపోయారు. అంతేకాకుండా తనమీద అక్రమ కేసులు బనాయించి తన కుటుంబాన్ని చంపుతానంటూ బెదిరించారని చెప్పారు. కావున నల్లపాడు పోలీసులు నిజ నిజాలు తెలుసుకుని తన స్థలమును తనకు ఇప్పించవలసినదిగా ఆయన కోరారు. సమావేశంలో ఉపాధ్యక్షులు సయ్యద్, మైనార్టీ ఇంచార్జ్ అసరుద్దీన్, గుర్రం రామారావు, ఎస్ కే జానీ బేగం తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తే మరిన్ని పథకాలు సాధిస్తా

*-ఆసియా యోగా స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ గోల్డ్ మెడలిస్ట్ శిరీష*



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : ఆసియా యోగా స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ గోల్డ్ మెడలిస్ట్ పోటీలలో మన దేశానికి తన ద్వార గోల్డ్ మెడల్ రావటం ఎంతో గర్వకారణంగా ఉందని ఆసియా యోగా స్పోర్ట్స్ ఛాంపియన్ బి. శిరీష వెల్లడించారు. యోగాలో ఎమ్మెస్సీ (ఎంఫిల్) వరకు పూర్తి చేశాను. వివిధ కళాశాలలో విద్యాసంస్థలో పనిచేస్తూ యోగ పోటీలో పాల్గొంటున్నానని, యోగాలో 18 సంవత్సరాల అనుభవం ఉందని ప్రభుత్వం ప్రోత్సహిస్తే దేశానికి మరిన్ని పథకాలు సాధిస్తానని తెలిపారు. గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అత్యుత్తమ సాంకేతికత మరియు భాగస్వామ్యాన్ని ప్రదర్శించి, కళాత్మక యోగాసన పెయిర్ ఈవెంట్‌లో గెలవడం తనకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. ఈ గెలుపుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి సహాయ సహకారాలు అందించాలని చెప్పారు. న్యూఢిల్లీలో జరిగిన 2వ ఆసియా యోగా స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి భారతదేశానికి ప్రాతినిధ్యం వహించి గోల్డ్ మెడల్ సాధించి మన దేశానికి బంగారు పతకం తీసుకురావటం తనకు ఆనందాన్ని ఇచ్చింది అన్నారు. శిరీష యోగ అకాడమీ స్థాపించి పేద మధ్యతరగతులకు ఉచిత యోగా శిక్షణ ఇచ్చి వారి ఇంటర్నేషనల్ క్రీడాకారులుగా తయారు చేస్తానని అన్నారు. యోగ స్పోర్ట్స్ ఆసియా అంతటా ఉన్న ప్రతిభావంతులైన యోగులను ఒకచోట చేర్చిందని, ఈ స్పోర్ట్స్‌లో అసాధారణ నైపుణ్యం మరియు అంకితభావాన్ని ప్రదర్శించడం పల్లె మన దేశానికి గోల్డ్ మెడల్ వచ్చిందన్నారు. ఏపీ తరపున భారత జట్టుకు వైస్ కెప్టెన్‌గా ఎన్నిక ఆవడం చాలా ఆనందంగా ఉందని, ఈ ఛాంపియన్‌షిప్‌కు నా ప్రయాణం కృషి, పట్టుదల, యోగా పట్ల మక్కువతో ముందుకు సాగిందన్నారు. మద్దతు ఇచ్చిన కుటుంబ సభ్యులు బాలం సుబ్బారావు, గురువులు బి.సత్యనారాయణ రాజు, జి. సీతారామయ్య, ఎంమ్.అంకమ్మరావులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. భారతీయ యోగాను ప్రపంచవ్యాప్తంగా ప్రోత్సహించడం, దాని ప్రయోజనాలు, సాంస్కృతిక ప్రాముఖ్యతను ప్రచారం చేయడం కొనసాగిస్తానన్నారు.

## అకాల వర్షాలకు దెబ్బతిన్న రైతులను ఆదుకోండి...



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : ఎన్టీఆర్ జిల్లాలో అకాల వర్షాలకు, పెనుగాలులకు పండ్ల రైతులందరికీ నష్ట పరిహారం అందించాలని కూటమి ప్రభు త్వం ఆదుకోవాలని ఎన్టీఆర్ జిల్లా వైసీపీ అధ్యక్షులు దేవినేని అవినాష్ డిమాండ్ చేసారు. మిర్చిధర లేదు, ధాన్యం లోడు ఎత్తిన వాటికి దిగుమతులు లేవు. ఈ లోపే చేతికి వచ్చిన పంట నేలపాలైతే రైతుకు చాలా బాధ కలుగుతుందని అని అన్నారు. ఈ సందర్భంలో అవినాష్ మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలో నష్టపోయిన ప్రతి రైతును కూటమి ప్రభుత్వం ఆదుకునే దిశగా చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. పంటలు కోల్పోయిన రైతులను కాపాడేందుకు ఈ క్రాప్ ఇన్సూరెర్స్ చేయించాలన్నారు. మద్దతు ధరలు పెంచి మార్కెట్లో దళారీ వ్యవస్థను నిర్మూలించాలని కోరారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో రైతులకు ఏ కష్టం వచ్చినా రైతు భరోసా కేంద్రాలు, వైసిపి నాయకులు అండగా నిలబడ్డారని అన్నారు. చంద్రబాబు వస్తే కష్టకాలమని రైతులు అంటున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించి రైతులు ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ప్రతి ఒక రైతుకు వైఎస్ఆర్పిపి అండగా ఉంటుంది అని అవినాష్ భరోసా ఇచ్చారు.

## ఎపి మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికుల జీతం పెంపుదలచేసి ఆదుకోండి...



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : నగరంలో ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ కార్మికుల జీతం పెంపుదల కోసం నిరసన కార్యక్రమం నిర్వహించారు. గురువారం ధర్నా చౌక్‌లో ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ రెండవ రోజు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో అధ్యక్షులు పిట్టా మహేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి ఎం.డి.గౌస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.కోటేశ్వర్‌గౌడ్‌లు మాట్లాడుతూ... అత్యవసర విభాగం అయినటువంటి నీటి సరఫరా, వీధి దీపాలు డ్రైనేజీ, పార్కులు, మెకానిక్‌లు, టౌన్ ప్లానింగ్ మరియు ఇంజనీరింగ్ అన్ని విభాగాల వారికి టెక్నికల్ రూ. 29,200, నాన్ టెక్నికల్ రూ.24,500 జీతాలు చెల్లించాలని, 10 సంవత్సరాలు పైబడిన ఇంజనీరింగ్ మున్సిపల్ కార్మికులను క్రమబద్ధీకరించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలన్నారు. ఎపిసిఓఎస్ రద్దు చేస్తే కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. పర్మినెంట్ కార్మికుల వలే మాకు కూడా పదవీ విరమణ వయసును ఎపిసిఓఎస్ కార్మికులందరినీ 60 సం. నుండి 62 సం.లకు పెంచాలని, ఇతర ఉద్యోగుల మాదిరిగా గ్రాడ్యూటీతో పాటు కనీస పెంక్షన్ రూ. 10,000లు ఇవ్వాలంటూ తదితర డిమాండ్లను తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమన్వయ కార్యదర్శి బత్తుల శివశంకర్, గౌరవ అధ్యక్షులు గుంటుపల్లి శేషగిరిరావు, ఉపాధ్యక్షులు పర్సాబుచ్చిబాబు, వేముల జయపాల్ తదితరులు, నీటి సరఫరా, వీధిదీపాలు, డ్రైనేజీ, పార్కు సిబ్బంది, వివిధ విభాగాల కార్మికులు పాల్గొన్నారు.

## నటరాజకు నాట్య వినోదం




విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : నాట్యచార్యుడు డాక్టర్ చింతారవి బాల కృష్ణ నృత్య శిక్షణలో దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య సంగీత కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించే కూచి పూడి నృత్య రంగ ప్రవేశం ఆదివారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు కార్య క్రమంలో వల్లభజోస్యుల శ్రీదత్త ప్రదర్శించిన అంశాలు నేత్రపర్వంగా సాగాయి. నర్తనగణపతి, చిందబరీశ్వర స్తవమ్, పదము, నగుమోము, ధిల్లానా అంశాలను ప్రదర్శించారు. నృత్య సంప్రదాయాన్ని పాటించి లైవ్ కార్యక్రమంగా సాగిన కార్యక్రమంలో నట్టువాంగం డాక్టర్ చింతారవి బాలకృష్ణ, గాత్రం సీహెచ్ శ్రీనివాస్, మృదంగం పసుమర్తి హరినాథ్, వయోలిన్ పాలపర్తి ఆంజ నేయులు, వేణువు కుమార్ బాబు సహకరించారు. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన వల్లభజోస్యుల పవన్, శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు. నిర్వాహకులు డాక్టర్ చింతారవి బాలకృష్ణకు గురు సత్కారం నిర్వహించారు.

## శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థానం పున:ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న మంత్రి నారా లోకేష్



దుగ్గిరాల, నేటి పత్రిక ప్రజావార్త : మంగళగిరి నియోజకవర్గం దుగ్గిరాల మండలం కంఠంరాజ కొండూరు గ్రామంలో నిర్వహించిన శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థానం పున:ప్రతిష్ట మహోత్సవంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఆలయానికి చేరుకున్న మంత్రి లోకేష్‌కు అధికారులు, స్థానిక నాయకులు మంగళవాయిద్యాలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆలయ పున:ప్రతిష్టను పురస్కరించుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక సారె, పసుపు, కుంకుమ, గాజులు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి నారా లోకేష్ రాకను పురస్కరించుకుని అర్చకులు ప్రత్యేక ఆశీర్వచనాలు అంద జేశారు. జ్ఞాపికను బహూకరించారు. అనంతరం ఆలయంలో నూతనంగా నిర్మించిన శ్రీ విఘ్నేశ్వర స్వామి, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉపాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి లోకేష్ రాకను పురస్కరించుకుని స్థానిక ప్రజానీకం పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనూరాధ, పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, టీడీపీ గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షురాలు కేసమనేని అనిత తదితరులు పాల్గొన్నారు.

**మార్గమధ్యలో బకింగ్ హెూం కాలువను పరిశీలించిన మంత్రి లోకేష్..**

శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థానం పున:ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమాన్ని ముగించుకుని మంగళగిరికి పయనమైన మంత్రి లోకేష్ మార్గమధ్యలో కాజ-చినవడ్లపూడి మధ్యలో గల బకింగ్ హెూం కాలువను పరిశీలించారు. కాలువలో పెద్దఎత్తున గుర్రపు డెక్క పూడుకుపోవడాన్ని గమనించారు. వర్షాకాలంలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా గుర్రపు డెక్కను తొలగించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

## 8 నుంచి చెస్ ఉచిత శిక్షణ శిబిరం


విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : ప్రభుత్వ, మునిసిపల్‌హైపాఠశాలల్లో చదివే విద్యార్థులకు గ్లోబల్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల ఎనిమిదో తేదీ నుంచి చెస్ ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిం చనున్నట్లు ఆ అకాడమీ కార్యదర్శి షేక్ ఖాసీం సోమ వారం ఒక ప్రకటనలో తెలిపారు. మొగ ల్రాజపురంలోని సిద్ధార్థ అకాడమీ పక్కనే ఉన్న తమ అకాడమీలో జూన్ ఎనిమిదో తేదీ వరకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 98495 14138 నంబరును సంప్రదించి, పేర్లను రిజి స్టర్ చేసుకోవాలని సూచించారు.

## కార్మికుల అభ్యున్నతే బీజేఎంసి ధ్యేయం

*-బీజేఎంసి జాతీయ అధ్యక్షులు ఆర్నబ్ చటర్జీ*



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : విజయవాడ కార్మికుల అభ్యున్నతే భారతీయ జనతా మజ్దూర్ సెల్ (బీజేఎంసి) ధ్యేయం అని బీజేఎంసి జాతీయ అధ్యక్షులు ఆర్నబ్ చటర్జీ తెలిపారు. గురువారం గాంధీనగర్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో అన్ని రంగాల్లో అసంఘటిత కార్మికులు, వీధి వ్యాపారులకు ఈఎస్ఐ, పిఎఫ్, రిజిస్ట్రేషన్ వంటివి ఏమీ ఉండనందున కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ-శ్రమ్ కార్డు అందేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం రైల్వే స్టేషన్లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు ఈ శ్రమ్ కార్డులు అందజేశారని అన్నారు. భారతీయ జనతా మజ్దూర్ సెల్ (బీజేఎంసీ) రాష్ట్ర అధ్యక్షులు షేక్. ఖలీఫాతుల్లా బాషా మాట్లాడుతూ ఈ మధ్యన కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న ఈ-శ్రమ్ కార్డుల యొక్క ప్రయోజనాలు చర్చకు రావడం జరిగింది. ఈ-శ్రమ్ కార్డు పొందిన లబ్దిదారులకు కేంద్ర ప్రభుత్వం రెండు లక్షల రూపాయలు ఏదైనా ప్రమాదం జరిగి మరణించిన లేదా పూర్తి స్థాయిలో అంగవైకల్యం చెందినా కేంద్ర ప్రభుత్వం పరిహారం అందజేస్తుందని తెలిపారు. నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఈ పథకం అమలుకు ఎన్నో చర్యలు తీసుకుంటుందని అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా ఈ-శ్రమ్ పథకం అమలుపై ప్రత్యేక దృష్టిపెట్టినట్లు ఆయన పేర్కొన్నారు. హౌఅర్హులైన కార్మికులకు అందేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ-శ్రమ కార్డు మరియు లేబర్ కార్డులను వారికి అందజేసేందుకు తమ సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం ఆటో డ్రైవర్లకు ఈ-శ్రమ్ కార్డులు, పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




Printed, Published and Owned by KONDURI SRINIVASARAO, Printed at M/s Arunodaya Note Book Manufacturers Pvt. Ltd., D.No:33-5-9, Papaiah Street, Seetharampuram, VIJAYAWADA, Krishna District, Andhra Pradesh and Published from H.No:24-9/1-148, Ramanagar, Ramakoti Maidanam, Bavajipeta 1st Line Cross, VIJAYAWADA 520 003, Krishna District, Andhra Pradesh.
Editor : Konduri Srinivasarao, RNI Title code No : APTEL 2021/80559, Phone No : 9948877444, Email id : konduri9999@gmail.com.